త్రైమాసిక. 4 1967 ఆగస్టు—అక్టోబర్

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

సోమసుందర్

ఇస్మాయిల్

మోహన ప్రసాద్

ప్రభంజన్

వే. నరసింహారెడ్డి

బండినాగరాజు

నవీన్

ఎస్. గోవిందరెడ్డి

శ్రీశ్రీ

కుందుర్తి

ఆర్. ఎస్. సుదర్శనం

రాజీవ

నిర్వహణ సాహితీ మిత్రులు. వెల: ఒక రూపాయి.

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

(త్రైమాసిక)

4

1967 ఆగస్టు—అక్టోబర్

సంపాదకుడు

వరవరరావు

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

వివరాలకు, ప్రత్యుత్తరాలకు:—
వ ర వ ర రా వు
జడ్ చర్ల (రైల్వే స్టేషన్)
మహబూబ్‌నగర్ జిల్లా.

ముద్రణ
పార్వతి ప్రింటింగ్ ప్రెస్,
జడ్‌చర్ల.

Printed and Published by *Varavara rao* for **'Sahithee Mithrulu'** at *Parvati Printing Press, Jadcherla* [*Rly. Stn.*] Editor: *Varavara rao.*

సోమసుందర్.

అగతానికి శుభారంభం

నన్ను నిందిస్తావెందుకు మిత్రమా?
నేరారోపణ చేస్తావెందు కసహనంగా!

మనలోని ఆటవికభావాలకు
పెర్లిన్ కుడతాలు తొడగలేను,
మనసులోని ముసలి భావాల పలితకేశాలకు
మలిన శృంగారాల నల్లరంగు పులమలేను;
వేషధారినై పట్టపగలు నటించలేను
ట్రాన్స్పరెంటు సిన్సియారిటీని
అలవర్చుకున్నది నా హృదయం
అదే మహా నేరమని నిందిస్తావెందుకు మిత్రమా!

నిజమే— నీ మనోభావాల నాశ్లేషించలేను
అంతమాత్రాన నీపై శత్రుత్వం లేదు.
నిజమే— నీ అభిప్రాయాల నామోదించలేను.
అంతమాత్రాన నీపై కత్తికట్టడం లేదు,
అశోకుని కాలంలో నాటిన
ఆలోచనా భూరుహచ్ఛాయల్లో
నీమనసు విశ్రమిస్తోందని నాకు తెలుసు.
నీ జ్ఞానభాండారానికి భవిష్యత్తులో
కాలదోషం పడుతుందని నాకు తెలుసు.
అంతమాత్రానికే కాదు సుమీ నా అభిమతం
నిన్నీ లోకంనుంచి తొలగించడం

2

సౌశీల్యవతి సౌందర్యవతి
చిరంజీవి సౌభాగ్యవతి కవితా గుణవతిని
నీ గొప్పకోసం స్కాండల్ చేయడం
నేను సుతరామూ భరించలేను
ఆ మగనాలికి నీతో దుష్టసంబంధాన్ని అంటగట్టి
నోటికి డప్పుకట్టి
ప్రచారం చేసుకోవడం
నేనెన్నటికీ సహించను,....
అపభ్రంశాన్ని క్షమించను.

ఆహా మిత్రమా నీలోని ఆదిమ భావాల
'హోహో హూహూ' అను థేమ్సు నదిలో
స్నానం చేయిస్తా వీదిస్తావు.
ఇక్ష్వాకుల కాలంనాటి యింగువ కట్టినగుడ్డలు
ఇస్లాం ఆలనా యింగ్లీషు పాలనా గడిచినా
ఇప్పటికీ నీకాదర్శాలు.
కళాయి కరగిపోయిన కులతత్త్వాల అద్దాలు
వర్తమాన విశ్వజనీనత ప్రతిబింబించని అబద్ధాలు.
ఆత్మవంచనలతో మానభంగాలు పొందిన అభిమానాలు
అవే నీ కళాహృదయాభిషేచనాభినివేశాలు!

వద్దు మిత్రమా, సంప్రదాయాల మద్యశాలలను
తాపోపశమనానికి చలివేంద్రలనుకోకు.

ప్రాణం పుచ్చి డొల్ల మిగిలిన ఆచారాల
అశ్వావలోకనా హ్రస్వదృష్టులను
హరీంద్రావలోకనంగా భ్రమించకు.
నీవు బ్రతుకుతున్న కాలం మీదే

ఎందుకు నీకింత చిరాకు?
గోచర్మం కప్పుకున్నంత మాత్రాన
వ్యాఘ్రాల వధ నిషేధించకు.
గోచార గ్రహచారయోగాల మీద
స్పూట్నిక్ యుగమిది—ఆధారపడకు.
స్వంతంగా తగిలించుకొన్న ఆత్మస్తుతుల
భుజకీర్తు లెన్నటికీ కావు కితాబులు.
అంతసులభంకాదు—నా దారి కడ్డంరాకు

3

తెరపిస్తాను నీ కోసం
సదసత్ వివేచనా చంద్రశిలానికేతనం;
జరిపిస్తాను మన కోసం
జనతా హృత్కల్హార వికాసోత్సవం;

రాగల వెలుగుల శుభదినాల
కాగత మొక చంద్రశాల
అదే కదా జనహృద్గత విషాదాల
తొలగించే జీవ హేల

కలసి మెలసి శ్రమించుదాం—రా నేస్తం;
కలసి మెలసి భుజించుదాం. రా నేస్తం;

జనమేజయుని కాలంనాటి నీభావాల తాళపత్రగ్రంథాన్ని
మ్యూజియమ్ముల్లో క్రిమిదష్టంకాకుండా భద్రపరుద్దాం
నీ మనోకులాయంలో ఎదుగుతోన్న
రాబందు పిల్లల్ని జ్యూల్లో సురక్షితంగా
పెంపకం చేయించుదాం, లోకాన్ని రక్షించుదాం.
ఉరగాల్ని వృకాల్ని సృగాలాల్ని ఖడ్గమృగాల్ని

ప్రశాంతి వంటి జనపదాలపై వదలకు.
ఆదారి మూసుకుపోయింది—వెనుకకు కదలకు;
అదే శ్రవఃపేయ సంగీతమనుకొని
చెడుగుల గుడుగుడులను పదరకు
జాత్యహంకారాల కాళింది మడుగులమునగకు

4

వర్తమానం — కిర్మీర వసనాంతర
వపుర్లతా కోమలం,
వసంత వనాంతర సురభిళకుసుమోత్కర
షట్పద శింజితం
నవరస భరిత సమగ్ర సంగీతం.

ప్రస్తుతమంటే గతానికంతం
ఆగతానికి శుభారంభం
మహోజ్జ్వల కాంతి వాహినికి
అవిరళధారా జలపాతం.

నిజం మిత్రమా, వర్తమానం—
నిన్ననే బయల్దేరి రేపుచేరుకునే యాత్రికులు
నేడు విడిసే పాంథశాల.
కాల సరిత్తరంగాల తేలివచ్చే
ఆగత మానవ గళసీమ నలంకరించే
ఆశానవ్యోషస్సుమ మాల!

నిజం మిత్రమా—వర్తమానం
రత్న ఖచిత కేయూరం;
వర్షాపులకిత కేదారం'
నర్తిత మయూరం
చైత్రోత్సవ బృందగానం!

5

ఇవే పువ్వులు చల్లాను నేను
బ్రతికినంత మేలా....
ఇవే సుగంధాలుపూశాను నేను
నడిచినంత మేరా....

ఇంతమాత్రానికే ఎందుకు మిత్రమా,
నాపై నీకింత కినుక?

ఆగ్రహోదగ్ర స్వరూపాలవల్ల
అసలు సమస్యలు విడవు.
కన్నులకు కెంపు సుర్మా పులుముకుంటే
ఆనవు సుమీ చిక్కు ముడులు.

ఒక కొమ్మకి పూచిన రెండు పువ్వులు
పరస్పరం ఒక్కనాటికీ కలహించవు.
బృందావనిలోని జంట పాదపాలు
తమలో తామెన్నటికీ ఆగ్రహించవు.

నా మాట నమ్మ మిత్రమా—
అజ్ఞానం దురహంకారానికి సోపానం;
అహంత నియంతల బాహిరరూపం;
తన చుట్టూ గిరిగీసుకోవడం
పసికందుల క్రీడా విశేషం;
తన చుట్టూ పాతభావాల కంచుకోటలు
కట్టుకోవడం—బందీ కావడానికే తప్ప
కళేందిరా స్వాధీనానికి సుతరామూ కాదు.

కనుక చివరిసారిగా మరొక్కమాట
నన్ను చెప్పనియ్యి మిత్రమా....
చిలకరించనీ నా పద్ధతిలో
నా వ్యక్తిత్వంతో పన్నీటి సువాసనల
ఓపినంతలో యీ లోకం మీద సుంత.

నీ ముఖానికి నా వదనం ప్రతిరూపం కాదని
కోపించడం అవివేకం తప్ప విజ్ఞతకాదు.
నా భావాలకు నీ అభిప్రాయాలు ప్రతిధ్వనులు కావని
నీపై విరోధించి నిన్ను నిరోధించడం
సాక్షాత్తు ఆటవిక మనస్తత్వం.

కనుకనే మిత్రమా—మనం ఒకే మాలలోని
రకరకాల పూలవలె బ్రతుకుదాం.
రంగులూ రుచులూ విరజిమ్మదాం.
సుహాసాల సువాసనా సవమానలహరిలో
లోకాన్ని సర్వాంగీణ రుచిరసుగంధంగా
మారుద్దాం! విరియిద్దామానందపర్ధనం!

భగ్నకామం

ఇస్మాయిల్

నిన్న—
నా చేతివేళ్లను
కొవ్వొత్తులుగా
వెలిగించాలనుకున్నా

రేపు—
నీ నరనరాల
శిఖరారోహణ
చూడాలనుకున్నా

ఇవాళ—
ఒఖణే
చీకటి తిమింగలం కడుపులో
తొడలు విరిగి పడుకొన్నా

నేను చాలా స్లో రచయితని. కాయితం మీదడిగే నా ప్రతిమాటకీ దాదాపు కష్టప్రసవమే. నేను రాయబోయే విషయం, మాట అంతకు ముందే ఎవరైనా చెప్పేసివున్నారేమో అనే సందేహం, నేను నాదిగా చెప్తున్నమాట సూటిగా స్పష్టంగా వస్తున్నదా అనే భయం నేనేం రాస్తున్నా కలుగుతుంటాయ్. ఈ సందేహ భయాలు నేను రాసిన వాటిని హాంపర్ చేశాయ నడంకంటే, కొంతవరకైనా సెన్సిబుల్‌గా తయారుచేశాయనే హంబుల్ ఒపీనియన్‌వుంది నాకు. ఈ అభిప్రాయానికి మీలాంటి గుడ్ రీడర్స్ గీటురాళ్లు ...

వేగుంట మోహనప్రసాద్.

ప్రవాసం

ఎర్రగా విచ్చిన మందారపు పూలులాంటి ఆనాటి గాయాలు లేవు
నిర్లిప్తంగా కాలం వీచిన నిరానందపు గాలికి రక్తమూ స్రవించదు
ఆ కత్తులు కోసిన బాధాలేదు
యీనాడు కేవలం
మిగిలిపోయిన మచ్చల మలినాంశాల జ్ఞాపకాల గాళ్ళు తప్ప
దేవుడెంతో దయతో యిచ్చిన
ఆ దుఃఖపు పగిలి పోయిన అద్దపు ముక్కలు తప్ప.
పోనీలే
కాగిపోయిన కన్నీళ్ళ నాపుకోలేమూ ఆర్పుకోలేమూ.

ఇక్కడంటావా.
చుట్టు ప్రక్కల ఒత్తుగా పెరిగిన కొండల్ని మించి వారానికో బస్సువచ్చి
ఏడెనిమిది తలపాగాలని దింపి కొండల మెలికలపురిని దింపుకొంటూ పోతుంది.
వాళ్ళకూ నాకూ బాగా స్నేహం కుదుర్తుంది.
జొన్న రొట్టెల్తో వేరుసెనక్కాయ పప్పుల్ని నంజుకు తింటాం.
రోజు విడిచి రోజు నేను అడవికి వెళ్ళి పుల్లా పుడకా ఏరుకుతెస్తాను.
మరీ ఎప్పుడైనా లోయల్లోంచి దుమ్ము ఎగిరి పడినప్పుడు
నాలుక్కుంకుడు కాయలు కొట్టి తలంటుకుంటాను.

బస్తీ మాత్రమేమంత దూరం.
ప్రతీ బేస్తవారం సంత జరుగుతుంది.
ఒంటెలూ గుర్రాలూ మేకపోతులూ అమ్మకాని కొస్తుంటాయెటూ
ఏది కావాలన్నా చుట్ట పొగాకూ చెప్పులూ గావంచా
చేతికర్ర అవసూనె ఎవరోకరెల్తూంటారయ్యే లేదూ
కాసేపే కొండల్దాటి వెళ్దామనే బుద్ధిపుకితే నేనే
వెళ్ళొస్తూంటానెటూ గకాన్ని దాటి యిప్పట్లో
బతకటమేగా కావాల్సింది నీకైనా నాకైనా।

బాగాచీకటి పడితే అసలు దీపాలవసరమే లేదు
ఎందుకూ అంతంత యినుప దూలాలు పాతీ తీగల కాళ్ళ బార్లాచాపీ
గాజు ముక్కల్ని బంతుల్లా చుట్టీ వెలిగింది వెలిగిందని
చప్పట్లు మేమిక్కడ కొట్టమూ కర్మచాలకెప్పుడన్నా కాంతిపోతే అన్నాలప్పుడు
మూగ పిల్లలు మాకు పుట్టనూ పుట్టరూ తినేదేదో కాస్తా తినేసి తొందర తొందరగా
పడుకుంటామూ అంత మాత్రాన పగటి భగవంతుడ్ని మర్చిపోమూ.
చూచావా ఎంత ప్రియతమమైన వస్తువూ కన్పించదూ
ఆదరినీ యీ దరినీ అందరమూ స్నానాలు చేస్తామన్నా.

సరే ఏ అర్థరాత్రో ఎవడికో పురుగు ముట్టిందని వస్తాడనుకో
ఎంతో ఉత్సాహంతో మృత్యువు మీద మాకుండే సహజమైన కుతూహలంతో
మూల మూలలున్న మూలికలన్నీ వెదుక్కొచ్చి మంత్రిస్తాం
మామూలుగా కాకుండా బ్రతికాడా ఆమందులన్నీ మళ్ళీపారేస్తాం
చావంటే పగపూనే పాముల మౌతామా ఎంతైనా?
మృత్యువునించి ఎవడికైతే రక్షరేఖ ఉన్నదో వాడసలు పుట్టనే పుట్టడు.
దుఃఖాన్ని అంటుకోకుండా ఎవడి పాదరక్షలీ భూమ్మీద నిలుస్తవి గనకా?
ఈ జన్మని నడవకుండ నిలూగా ఎక్కడా యీదలేమూ.

నేను పట్నం వెళ్ళినప్పుడు ముసలి రాధాముకుందుడికి మనవడికి
ఆడుకోటానికి గిలక్కాయో, కొంచెం వయసొచ్చిన రాణీబాయికి
రంగుల కాగితాలంటించిన గాలిపటమో, ఎప్పుడూ పొలంలోనే
ఉండే పాటిలుకి ముట్టుకుంటే గుచ్చుకొని గిచ్చే గొంగడియో
నే నొక్కసారే సరిపడా తెచ్చుకొనే సరుకుల్తో వేసుకొస్తుంటాను.
పోనిద్దూ కాసిని డబ్బులు నాకుమాత్రం పిల్లాజెల్లా?
అన్నాయనో బాబాయనో మామయ్యనో వాళ్ళు నోరారా పిలుస్తారు.
కొండల మీంచి ఒక్కొక్క దిగులూ దొర్లుకుంటూ క్రిందపడ్తుంది.

ఈ అజ్ఞాత వాసంలో రాత్రిళ్ళెలాగో గడిచేపోతవి.
పగళ్ళంటావా పనిగట్టుకొని పది మందిలో పడిపడి నవ్వేదీ లేదు.
పుట్టిన ప్రతివాడి ప్రత్యక్ష పరోక్ష దుఃఖాలను త్రవ్వుకొంటే అంతేలేదు

ఆనందపు దూరాన్నికొల్చుకునే కాలపుకొలబద్ద చాల చిన్నది.
దీపపు వత్తి ఒకసారే పైకి లాగితే అందులోవున్ననూనె ఎంతోమరి!
అందుకనే ఆ కత్తులుకోసిన మంటాలేదు బాధాలేదు తీపీలేదు
మానిపోయిన గాయాల్ని చూపే మమతా టీపమూ లేదంతా
మొదట్లోనే అయిపోయిందా మళ్ళా వెనక్కెందుకు పిలుస్తావూ!

ఏదైనా పెద్ద యింట్లో ఎదిగి వచ్చిన కొడుకుపోయో
ఓర్పునేర్చిన కోడలుపోయో పసుపురాసిన పెద్దగుమ్మంకూలో
నిశ్శబ్దం ఆవహిస్తుంది శోకం విస్తుపోతుంది
ఆదుఃఖం యిట్లాంటిది
యిట్లాంటి పరమోత్కృష్టమైన దుఃఖంలేనేలేదికనివర్ణించుకుంటాం
ఎప్పటికప్పుడు అశ్రువులతో విచారాన్ని చెరిపేసుకుంటాం.
చిన్నపిల్లలు అన్నాలు తినరు మనకేసి చూస్తూంటారు ఎక్కడిబొమ్మల్నక్కడే వదిలేసి
వాళ్ళ ముఖాలుచూచి మనం మళ్లా యిల్లు అలుక్కుంటాం
పెద్ద జబ్బుచేసి కోలుకున్నమనం మెల్లగాలేచి దిండ్లకానుకుంటాం.

ఎటూ కన్నీళ్ళ నాపుకోలేమూ ఆర్పుకోలేమూ ఏదన్నా నదిలా
ఒక్కసారిగా పగిలిపోయి ఘోరుమందామా?

ఇవ్వాటి అర్థంకాని ఈ ఆవేదన

ఇగురించే ఆనందానికి ఆవాహన.

ఇవ్వాళ అరగట్టుకున్న ఈ పేగులు
రేపటి విప్లవ వీణకు తంత్రులు
ఈ కళ్ళలోని తడిలోంచి
రేపటి నెత్తుటి పువ్వులు పూస్తాయి.
నిగళాలుపడ్డ ఈ చేతులు
నిర్భయంగా గళం ముడివిప్పే
నిప్పులాంటి కావ్యం రచిస్తాయి
ఇవ్వాళ మండుతున్న ఈగుండెల్లోంచి
రేపటి సూర్యుడు ఉదయిస్తాడు.

—ప్రభంజన్.

వే. నరసింహారెడ్డి

ఈ తమస్సు చీల్చబడుతుంది.

అర్ధాంగిలా 'వెన్నంటే' ఆకలిని భరింపలేక
అయస్కాంత కాంతవంటి అవినీతిని వరింపలేక
మోపులై తూపులైవచ్చే ఆపదల వారింపలేక
బ్రతుకు బాటలోనపడిన గతుకుల పూరింపలేక

జీవఫలం చేదురసం త్రాపేందుకు చేవలేక
చావలేక, మునుముందుకు పోవలేక
ఊతలేక, చేతకాక సతమతమవుతావెందుకు
నేనున్నానిక, అన్నా! పదపద ముందుకు.

దగాపడిన సోదరుడా! దిగులుపడకు
రా! ఈ యెడకు
రగిలే కోపాగ్ని విడకు
పడిన గోతిలోనె పడకు
ఏడ కొడితే రావణుడు పడతాడో చూడు
పట్టు విడవకు.

దేబెవోలె దిక్కులు చూడకు
దీనంగా ఎవ్వడినో వేడకు
తుప్పుపట్టిన కత్తికి పదనుండదు
నిప్పుకణికకెప్పుడూ చెదలుండదు.

విప్లవం ప్లవంగంలా ఎక్కణ్ణించో
ఎగిరిరాదు.
మన దేహంలో రక్తం ఇంకా
ఇగిరిపోలేదు, పోదు.

ఇదిగో! ఆత్మవిశ్వాస శ్వాస పీల్చుకో
—ఇక మరణం లేదు
ఇది నీఇల్లే సుమా! పోల్చుకో
—ఒరుల శరణనరాదు

విప్లవం కూడా వసంతంవలెనే
వేయి విధాలై ప్రభవిస్తుంది
పూవి తావిలా నిశ్శబ్దంగా
జీవ నదివలె వశబ్దంగా
కోటిరీతుల ప్రసరిస్తుంది.

అడుగడుగునా అడుక్కుతినే
బడుగు జాతి 'అడుగం'టక తప్పదు
ఆత్మను అమ్ముకున్నవాడు
'అమ్మ'నూ అమ్ముకుంటాడు

వాడు జీవించటం పాపం
అది దేశానికి శాపం

ఊరకే చీకటిని తిడుతూ కూర్చోకు
ఒక దివ్వెవెలిగించు, ఒక జ్వాల రగిలించు

అచ్చమైన దేశభక్తి ఎదనిండానించు
చిచ్చై. విచ్చై పయనం సాగించు

ఈ సమస్య తేల్చబడుతుంది; తప్పదు
ఈ తమస్సు చీల్చబడుతుంది.

బండి నాగరాజు

భయం లేదు, రా!

ఏమిటి నువ్వంటున్నది?
ఈ సారి వస్తే మొత్తం ముం చెత్తుక పోతావా?
పో!
ఎవర్ని బెదిరిస్తున్నావు?
ఇదుగో అదుగో అంటూ ఎందు కా బిభీషికలు?
వచ్చే దేదో, రా!
నీ బుడ్డ బెదిరింపులకు నేను భయపడేది లేదు!—
        నీకు తోడుబోయినవాళ్ళు భయపడాలి!!
ఎవరికి భయం నువ్వంటే?
        అనాగరికులకు! అశాంతి పరులకు!
        ని న్నింతకాలం పెంచిన వాళ్ళకు!
        నిన్ను ఎముకల మూలగలో ఉంచుకొని
        నిస్సారు లై పోతున్న నికృష్టులకు!!
నీ ప్రళయ తాండవం ఎవరికి భీతికరం?
        —అదుగో, వాళ్ళకే!!
నాగరికులకు, శాంతికాముకులకు నీ వంటే లెక్కేమ్?
నీ వేం చేయగలవని?
        అమానుషంగా ప్రవర్తిస్తావు!
        నాగరిక చిహ్నాలను నాశనం చేస్తావు!
        శాంతి కాముకులను చంపేస్తావు!
        ఒహాయ్యబ్బ! ఇంతేనా?
చంపడ మేం పెద్ద పని?
చావడానికి భయపడే చవట
        ఈ మట్టిలో ఇప్పటికి పుట్టలేదు. పో!
ఇక్కడ గాదు: నన్నుగాదు—
నీ బెదిరింపులకు భయపడేవాళ్ళు వేరే వున్నారు పో!!

పుట్టక ముందే పుటుక్కుమన వలసిన నిన్ను పెంచి, పెద్దచేసి—
ప్రపంచాన్ని భయపెట్టేంత పెద్ద చేసి—
'ఇదుగో, అదుగో వస్తాం' దనిపించేంత భయంకర మనిపించి
సామ్రాజ్య కాంక్షలతో నీలుగుతూన్న నిమ్న జాతులవాళ్ళున్న
దిక్కుడ గాదు।
పో। వాళ్ళను బెదిరించు।।
నీ వంటే వాళ్ళు భయపడు తున్నారు।
నీ ప్రతాప మంటే వాళ్ళకు అస్థిలో జ్వరం।।
ఛస్తా మేమో నని యిప్పటికి లక్షలాది సార్లుగా చచ్చిపోతున్నారు,
ఆ పిరికి పందలను బెదిరించు, పో।
వస్తా నంటావు? రా మరి।:
దమ్ము లుంటే రా।।
వచ్చి నిన్నింతగా పెంచిన యీ పిరికి జాతిని
పొట్ట బెట్టుకో! మట్టిలో గలుపు।।
దాంతో నీకూ శాశ్వత సమాధి।।
శుద్ధ మైన శాంతి, నిక్షేప మైన, నాగరికత
నీ బెదిరింపుల అనంతరం నిర్ణిద్రంగా నెలకొననీ।
రా।
వచ్చి చేసే దేదో త్వరగా కానీ!—
ఈ నాగరికతకు, ఈ శాంతికీ వెనుక నీ వింకా బతికి
నీలుగుతూ వుంటే,
మాకెందుకీ నాగరికత? ఈ శాంతి బురఖా।
ఏం వస్తున్నావా?
రా।
ఇప్పటికి రెండుసార్లు వచ్చింది గాదు।
ఈ సారి వచ్చి, యీ అనాగరిక ప్రపంచాన్ని యావత్తూ
సమూలంగా నాశనం చేసి పో।
బిభీషికలు వద్దు! నిర్భీకరంగా రా।।
ఓ మూడో ప్రపంచ యుద్ధమా!
భయంలేదు, రా।

నవీన్.

తీరిన కోరిక

ఐ హేట్ హర్.... ఐ హేట్ హర్ విత్ ఆల్ మై సోల్ అండ్ హార్ట్.... బొగ్గులు తేవాలట.... బొగ్గులు.... తన జీవితంలోకి బొగ్గులే తెచ్చింది.... మల్లెలు తెస్తుందనుకొన్నాడు. మందారాలు తెస్తుందనుకున్నాడు. మకరందం కురిపిస్తుందనుకున్నాడు. మాధుర్యంతో ప్రపంచాన్ని మరపిస్తుందనుకున్నాడు. కాని బొగ్గులు.... బొగ్గులు తెచ్చింది...."వచ్చేటప్పుడు బొగ్గులు తీసుకరాకపోతే రాత్రికి వంట సున్న." ఎంత నిర్లక్ష్యం.... ఎంతఅహంకారం.... ఎంత బాధ్యతారాహిత్యం.... ఎంత తేలిక తనం....తన సంపాదన మీద, తన బ్రతుకుమీద....మార్కెట్‌లో తనవిలువ మీద.... ఛీ....ఛీ.. ఛీ... ఈ ఆడవాళ్ళంతా యింతే. తమ ఆర్థికావసరాలు తీర్చే ఒక సాధనంగా వాడుకుంటారు మగవాన్ని. మగవాడు ఆ సాధనం కావటంలో ఫెయిల్ ఐతే వాడిని ఎంత అపహాస్యంపాలు చెయ్యటానికి కూడా వెనుకాడరు. ఇది లాస్ట్ వీక్ కదా.... తన దగ్గర నయాపైసా లేదని తెలుసు కదా.... ఎందుకలా బొగ్గులు తెమ్మని పురమాయిస్తుంది? తను ఎలా తేగలడు. ఏ పక్కవారింట్లోనో అరువు తెచ్చి ఎలాగో ఈ రెండు రోజులు గడపకూడదు? అబ్బే ...ప్రక్కవారిని అడగదట.. ఇంటింటికి బిచ్చమెత్తదట.... కాని తను మాత్రం ఎవడిదగ్గరకో వెళ్ళి కాళ్ళాపడి డబ్బు సంపాదించి, బొగ్గులు కొనుక్కొనివస్తే వంట చేస్తుంది....తన పెళ్ళైనప్పటి నుండి చూస్తున్నాడు... సావిత్రిలో ఆ గర్వం.... ఆ నైర్లక్ష్యం.... తనంటే ఆ తేలిక భావం.... తమ పుట్టింటివాళ్ళు బాగా డబ్బున్నవాళ్ళనే ఆ సుపీరియార్టీ కాంప్లెక్స్.... తన అన్నగాడెవడో తహసిల్దార్ అనే బింకం ... అంతగొప్పవాళ్ళయితే తనకెందుకిచ్చారు? ఏ మహరాజ కుమారుడికో యిచ్చి చెయ్యక పోయారా? ఒంటిస్తంభం మేడమీద కూర్చోబెట్టి ప్రతిరోజూ పూజచేసేవాడు.... అసలు తనన్నా, తను చేస్తున్న ఉద్యోగమన్నా సావిత్రికి యేమాత్రం గౌరవం లేదు....ఆకారణంగానే తనంటే అంత నైర్లక్ష్యం....తేలికభావం ... ఆ నైర్లక్ష్యాన్ని, ఆ తేలికభావాన్ని ఎలా అణచెయ్యాలో తనకి అంతుపట్టటంలేదు ...

రాజారావు ఇంటినుండి కాలేజీ వైపునడుస్తున్నాడు. అతని చేతిలోఉన్న చిన్న నోట్‌బుక్ నలిగిపోతున్నది. దార్లో ఇద్దరు ముగ్గురు స్టూడెంట్స్ "గుడ్‌మార్నింగ్ సర్" అంటున్నా రాజారావు గమనించటం లేదు.

సావిత్రిని మొదటిసారిగా చూసినప్పుడు ఎన్ని మధుర స్వప్నాలలో తేలిపోయాడు .. సావిత్రి నిజంగా అందమైంది. (ఆమె గర్వానికి కారణం కొంతవరకు ఆ అందమనికూడా తనకి చాలాసార్లనిపించింది.) ఏ ఊర్వశో, మేనకో దివినుండి భువికి తనకోసం దిగివచ్చిందనుకున్నాడు. ఆమెతో గడపబోయే జీవితాన్నిగూర్చి ఎంత భావకవిత్వం రాసుకున్నాడో తనలో తను. ఎన్నియుగాలుగానో తను సావిత్రి కోసం ఎదురుచూస్తున్నాననుకున్నాడు. ఆమెలో ఐక్యమైపోయి తరతరాలుగా అనుభవిస్తున్న నిరంతర తపనని, విరహాన్ని తీర్చుకోవాలనుకున్నాడు. చలంగారి ఊర్వశీ, పురూరవుల్లా ... సావిత్రీ తనూ గొప్ప ప్రేమమయ, శృంగారమయ జీవితాన్ని గడపాలనుకున్నాడు.... పెళ్ళయ్యింది.... కలల్లోనుండి వాస్తవంలోకి వచ్చాడు. అందం తను అనుకున్నంత పవిత్రమైనది, అలౌకికమైనది కాదనిపించింది. సావిత్రిలో ఐక్యమై తన జీవితాన్ని తరింప చేసికోవాలన్న తన కోరిక తీరలేదు.... అసలు సావిత్రికి తనకి మధ్యయెన్నో తెరలు.... సావిత్రిలో ఎప్పుడూ ఆ అంటీ అంటనితనం యేదోమాయ....తనకర్థంకాని యెన్నో లోకాలు....అలోకంలోకి తనని రానివ్వదు. తను వెళ్ళలేడు ... ఆమాయని మాయంచెయ్యలేడు. సావిత్రి అందం తనకో ఎండమావి అయ్యింది. వెర్రిగా ఆ ఎండమావిని అనుభవించాలనుకుంటాడు. వెర్రిగా ఆ ఎండమావికోసం పరుగెత్తుతాడు- కాని ఆ అందానికి, తనకి మధ్య అశేషమైన అఖాతాలున్నాయి. ఆ అందం తనది కాదు. తనది చేసుకోలేడు ... అదో అడవికాచిన వెన్నెల ...

తనంటే సావిత్రికి ఆ నిర్లక్ష్యం ఎందుకో తనకర్థంకాదు. తనకేం తక్కువ? అందంగా లేడా? తను ఎం. ఏ. చదివే రోజుల్లో తమకి పొలిటికల్ థాట్ చెప్పే మేడమ్ (చాలా అందంగాఉండేది....కొంచెం వయస్సెక్కువైనా....) తననెప్పుడూ "ఎవెరీస్మార్ట్‌బోయ్" అనటం మరచిపోలేదు....తన క్లాస్‌మేట్ ఉమ తనకేసి ఆశగా చూడటం ఎప్పుడూ జ్ఞాపకం వస్తుంది ... కాని సావిత్రి ... ఒక్కసారైనా.... తన జుట్టులోకి చేతులుపోనిచ్చి, (తన భార్య తనజుట్టులోకి చేతులు పోనిచ్చి మాట్లాడాలని

తన గాఢమైన కోరిక) తన కళ్ళల్లోకి పరవశంతో చూస్తూ, తన హృదయం మీద వాలిపోయి "మీరు ఈ సూట్‌లో చాలా బావుంటారండి .... ఈ కలర్ మీకు అద్భుతంగా ఉంటుంది" అంటుందా? పోనియ్ .... తను "నువ్వు ఈ చీరెలో అద్భుతంగా ఉంటావు....ఈ చీరె కట్టుకో'' మంటే "అబ్బే! ఆ చీరెలో అమ్మమ్మలా గుంటాను....యేం సెలక్షనండీ'' అంటుంది—ఒకసారెప్పుడో బట్టలషాప్ కెడితే ఎవరో ఒక అందమైన యువతి ఒక చీరె బేరమాడుతూంటె చూసాడు. ఎందుకో తనకా చీరె వెంటనే నచ్చింది— (ఆ యువతి అందంగా ఉండటంవల్ల ఆ చీర అందంగా కన్పించిందేమోనని ఆ తర్వాత అనుకున్నాడు.) సావిత్రి ఆ చీరెలో యే వైజయంతిమాల లాగానో ఉంటుందనిపించింది. వెంటనే ఆ చీర ఆ అమ్మాయి అడిగిందానికంటే ఐదు రూపాయలు ఎక్కువిచ్చి .... సావిత్రిని .... తన ముద్దుల భార్యని....సంతోషసాగరంలో ముంచెత్తాలని, ఆనంద పారవశ్యాలలో తేలించాలని ... కొండంత ఆశతో యింటికొచ్చాడు. "ఏడ్చినట్టుంది ... మీరిలాగే చెత్త చీరలకి డబ్బు తగలేస్తా"రంది....తన ముఖం మీదే....ఆ రాత్రంతా ఎంత నరకయాతనని అనుభవించాడో?

రాజారావు జేబులో నుండి దస్తీ తీసి చమట తుడుచుకున్నాడు....దస్తీ బాగా మాసిపోయి డర్టీగా ఉంది....ప్రతీరోజు చెప్తాడు సావిత్రితో "కాస్త దస్తీలు పిండి పెట్టమని'' .... ప్రతి రోజు కాలేజి కెళ్తూ, శుభ్రమైన దస్తీ జేబులో పెట్టుకొని వెళ్ళాలన్నదికూడా తీరని కోరికే అయ్యింది....వెధవ బ్రతుకు—గట్టిగా మాట్లాడితే అనాగరకంగా అసభ్యంగా ఉంటుందనే భయంతో ఎన్నింటిని సహిస్తున్నాడో....

తను ప్రతిరోజూ కాలేజికి వెళ్తుంటాడు కదా ...వెళ్ళేటప్పుడు ఒక్కసారైనా ప్రేమగా, గోముగా "మళ్ళీ ఎప్పుడొస్తారు....ఇంతసేపు ...ఇన్నియుగాలు మిమ్మల్ని విడిచి ఎలా ఉండను ...వచ్చేటప్పుడు నాకేం తెస్తారు...." అంటూ ఒక తీయని ముద్దిస్తుందా? అలా అన్పించుకోవాలని తనతో ఎన్నాళ్ళుగానో ఒక గాఢమైన కోరిక... పోనియ్ తను వెడ్తుంటే "ఇదిగో....పెన్ను మఱచిపోయారు....బీరువా తాళపు చెవి మరచిపోతున్నారు....టెక్ట్స్ బుక్ మఱచిపోతున్నారు....ఎంత మతి మఱపుబాబు.... ఆ పిల్లలకేం చెప్తున్నారో....ఈ ఫ్లాస్క్‌లో హార్లిక్సు పోసాను ... మధ్యాహ్నం తీసికోవటం మఱచిపోకండి .... ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవటం తెలియనే

తెలియదు....పసిపిల్లాడి కంటే అన్యాయం" (పసిపిల్లోడికంటే అన్యాయం అని అన్పించుకోవటం తనకి చాలా యిష్టం .... మొన్నటి వరకు అమ్మ అంటుండేది మావాడు పసిపిల్లాడి కంటే అన్యాయమని) అంటుందా? కనీసం పుట్టింటికెళ్ళేప్పుడైనా "ఆరోగ్యం జాగ్రత్త"నో "హోటల్ తిండి మీ కసలే పడద"నో "నేనొచ్చే వరకు ఎంత చిక్కిపోతార"నో "మిమ్మల్ని విడిచి ఒక్క క్షణమైనా బతకగలనా వెంటనే తిరిగిరానూ!" అనో అంటుందా? ఈ కోరికకూడా తనకి తీరని కోరికేనా? ఈ విషయాలన్నీ ఎవరితోనైనా చెప్పుకునేవా? పుట్టింటి కెళ్ళాక ఉత్తరం రాస్తుందేమోనని ఎదురు చూస్తాడు. ఉత్తరాలు రాసికోవటం తనకి యెంతో యిష్టం. ఒక ప్రేయసిని ఊహించుకొని ఇలా ఇలా లవ్ లెటర్స్ రాసికోవాలని చదువుకునే రోజుల్లో ఎన్ని మధుర స్వప్నాలని కనేవాడో.... సావిత్రి అసలు ఉత్తరాలు రాయదు.... మొదట్లో తను ఎంతో రొమాంటిక్‌గా, పేజీలకొద్ది ఉత్తరాలు రాసేవాడు. "ఏమోనండి ఆ కవిత్వం నాకేం అర్థం కాలేదు...." అంది ... ఒక సారి చెత్తకాగితాలతోపాటు తనురాసిన ఉత్తరాల్ని బయట పారేస్తుంటే చూసాడు ...గుండెలు మండిపోయాయి. అప్పుడు అనిపించింది ...తనో అందమైన పశువుని చేసికున్నానని....సావిత్రి మీద చెప్ప లేనంత ఆగ్రహం, అసహ్యం కల్గాయి ..కాని యేమి అనలేకపోయాడు ...మండే గుండెల్ని తనే చల్లార్చుకున్నాడు .. యేమైనా అంటే అదో పెద్ద సీన్‌కి దారితీస్తుంది.... సావిత్రి రెచ్చకొట్టే మాటలు బాగా అనగలదు....మాట మాట పెరగటం ...గట్టిగా అటుచుకోవటం తన కసహ్యం.... ఉత్త అనాగరికంగా, అసభ్యంగా, కొండజాతి ప్రజల కేచులాటలా ఉంటుంది....తను ఎప్పుడైనా యే కొంచెం గట్టిగా మాట్లాడినా వెంటనే సావిత్రి ఇదే ఆయుధం ప్రయోగిస్తుంది. "మనకి, అలగా జనానికి భేద మేముంది"...అంటుంది. (తనో అలగాజనం వాడిని పెళ్ళి చేసికున్నాననే అర్థం ధ్వనిస్తుంది తనకా మాటలో)

తను యెన్నిసార్లో సరిపెట్టుకోవటానికి ప్రయత్నించాడు. తనకి కొన్ని పిచ్చి సెంటిమెంట్స్ ఉన్నాయని, పిచ్చికోరికలున్నాయని అవన్నీ ఉత్త బాల్యచేష్టలని.. వాటన్నింటిని నిర్దాక్షిణ్యంగా అణచేసికున్నాడు. అన్నింటి కంటె ముఖ్యం తనకి స్త్రీలంటే ఎంతో గౌరవం. ఒక పదేళ్ళ శరత్ సాహిత్యం, చలం సాహిత్యం "త్రాగి బ్రతికాడు." ఈ దేశంలో స్త్రీకి చాలా అన్యాయం జరిగిందని తరతరాలుగా స్త్రీని పురుషుడు హీనాతి హీనంగా తన పాదాల క్రింద అణచి పెడుతున్నాడని

పాతివ్రత్యం అనే పేరుతో, స్త్రీని, యెలాంటి వ్యక్తిత్వం లేని ఒక బానిసగా తయారు చేసారని ఈ కారణంగా స్త్రీ మానసికంగా యెదగలేక పోతున్నదని కాబట్టి స్త్రీకి సంపూర్ణ స్వాతంత్ర్యం అవసరమని పురుషుడు, సమాజం, కట్టుబాట్లు మొదలైన కబంధ హస్తాల్లోంచి స్త్రీ బయటపడాలని—తను గాఢంగా నమ్మేవాడు. స్నేహితుల్తో వాదించేవాడు గొంతు చించుకునేవాడు. ఆ రోజుల్లో తన ఊర్లో ఎప్పుడూ భార్యను ఘోరంగా, క్రూరంగా హింసించే రామయ్య జ్ఞాపకం వచ్చేవాడు. ప్రతీరోజు ఆ రామయ్య తన భార్యని గొడ్డునిబాదినట్లు బాదేవాడు. చితకకొట్టేవాడు. చుట్టు ప్రక్కల వాళ్ళంతా ఆ దృశ్యాన్ని వినోదాన్ని చూసినట్లుగా చూసేవాళ్ళు. అందరితోపాటు తనూ అలాచూస్తూ నిల్చొనేవాడు. అంత మందిలో వక్కడైనా రామయ్యకి అడ్డొచ్చేవాడు కాడు—ఎవరైనా ధైర్యంచేసిరామయ్యని ఆపబోతే "నా పెళ్ళాన్ని నేను తంతాను.... చంపుతాను నువ్వెవడివిరా" అంటూ నానా మాటలు తిట్టేవాడు....పావం రామయ్య భార్య కుయ్యో మొర్రో అంటూ ప్రతీరోజు రామయ్య దెబ్బల్ని భరించేది—ఐనా అంతా ఆమెదే మంచి బుద్ది కాదనేవాళ్ళు .... తనకది క్రూరంగా, రాక్షసంగా, అమానుషంగా కన్పించేది....తనలోని నరనరాలు బాధతో మూల్గేవి. ఆ రామయ్య నొక పశువుగా, మనుష్యుల్ని భక్షించే నరరూప రాక్షసుడిలా ఊహించుకునేవాడు ... అలా బాధపడిన తన బాధకి మాటల రూపం యిచ్చిన చలంగారి పుస్తకాలు ఆరోజుల్లో తనని ఎంత ఉత్తేజ పరచాయో। చలంగారు "స్త్రీ" పుస్తకానికి మొదట్లో రాసిన "స్త్రీకి ఒక హృదయం ఉంది........" అనే వాక్యాలని—ప్రతిరోజు ఒక మంత్రంగా పారాయణచేసేవాడు. భర్త, భార్యకి అమె వ్యక్తిత్వం నిలుపుకునే స్వాతంత్ర్యం యివ్వలేకపోతే ఆ భార్య వెంటనే విడాకులిచ్చి వెళ్ళిపోవాలని....అలా విడాకులిచ్చిన స్త్రీని సంఘం చిన్నచూపు చూడకూడదని....భర్తా, భార్యల మధ్య ఒక సంపూర్ణభావ సమైక్యత లేనిదే, ఆ కాపురం కొనసాగించటంలో అర్థం లేదని....ఇలా ఉండేవి తన అభిప్రాయాలు....ఇవే అభిప్రాయాల్ని తను పెళ్ళిచేసికున్నాక తన జీవితంలో ఆచరించటానికి ప్రయత్నించాడు. వ్యక్తిగాకాని, తన భార్యాగాకాని సావిత్రిని తనెన్నడూ కించపలచలేదు. తన నెంత రెచ్చగొట్టినా, తన ఆత్మ గౌరవాన్ని గాయ పరచినా సహించాడేగాని సావిత్రిని యేమీ అనలేదు.

ఒక సారి గమ్మత్తైన సంఘటన జరిగింది. సావిత్రి, తనూ రిక్షాలో సినిమా కెడుతున్నారు....దార్లో కూర గాయల మార్కెట్ కన్పించింది. సావిత్రిని ఉడికించాలని

"అదిగో.........అక్కడ కూరగాయలమ్ముతున్న అమ్మాయుంది చూడు.........చాలా అందంగా ఉంది కదు'' అన్నాడు....

"ఎక్కడ....నాకు కన్పించటం లేదు'' అంది సావిత్రి

"అదిగో....ఆ మూడోషాపు....నేనెప్పుడు కూరగాయలు తెచ్చినా అక్కడే తెస్తాను....ఆ అమ్మాయి అంటే నాకిష్టం" అన్నాడు.

"ఔను.... మగవాళ్ళేం చేసినా చెల్లుతుంది.... అదే ఆడది చేస్తే....'' అంది సావిత్రి నిష్ఠూరంగా....వెంటనే తనకి స్త్రీ స్వాతంత్ర్యాన్నిగూర్చిన తన అభిప్రాయాలు గుర్తొచ్చాయి.... స్త్రీల కోసం గుండెలు బాదుకునే తనని తన భార్య అలాఅనటం చాలా ఘోరంగా తోచింది....వెంటనే అన్నాడు.

"అదేంలేదు సావిత్రి... నాకిష్టమైన ఆడవాళ్ళున్నట్లే, నీకిష్టమైన మగవాళ్ళుండొచ్చు... నాకేం అభ్యంతరం లేదు .... మన వాళ్ళుచెప్పే పాతివ్రత్యం అంటే నాకు భలే అసహ్యం...."

"ఊరికే మాటలంటారు....నిజంగా మా యిష్టాల్నిచెప్తే మీరు భరిస్తారా?"సావిత్రి.

ఎన్నాళ్ళుగానో తన హృదయ మంతటితో నమ్మిన తన అభిప్రాయాలకి, సావిత్రి ప్రశ్న ఒక ఛాలెంజిలాతోచింది.

"నా మాటలమీద నమ్మకం లేదా? ఇప్పుడే చెప్పు... నీ కిష్టమైన మగవాళ్ళెవరైనా ఉంటే ...నే నేమి అనుకోను....ప్లీజ్....సావిత్రి....చెప్పు...." అన్నాను ఆవేశంగా.

"అదిగో....అలా పోతున్నాడే ఆ రిక్షావాడంటే నాకు చాలా యిష్టం" అంది సావిత్రి చిలిపిగా నవ్వుతూ ...తన కారిక్షావాడు కన్పించలేదు. కేవలం తనను ఉడికించటానికి సావిత్రి అలా రిక్షావాడిని చూపించిందని తనని తాను సమాధాన పఱచుకోబోయాడు. తేలికగా నవ్వటానికి ప్రయత్నించాడు. కాని తనకి తెలియకుండానే తనలో సావిత్రి పట్ల యేదో అనుమానంలాంటిది స్థావరమేర్పరచుకోబోయింది....కాని వెంటనే కొట్టి వేసాడు.... త్రుంచి వేసాడు .... మఱచిపోవటానికి ప్రయత్నించాడు .... (ఐనా, ఎందుకో మఱచిపోలేక పోయాడు....ఆ రిక్షావాడెలాగుంటాడోనని వాడిరూపాన్ని రకరకాలుగా ఊహించుకున్నాడు.)

ఏమైనా సావిత్రికి తను దగ్గర కాలేకపోయాడు. ఇద్దరి మధ్య ఆ తెరలు అలాగే ఉన్నాయి. సావిత్రితో ఒక సంవత్సరం కాపురం చేసినా, సావిత్రి తనకి

యింకా ఒక మాదిరిగా, ఒక చిక్కు ప్రశ్నలాగానే ఉంది....సావిత్రి అందం తనకి యింకా ఎండమావే....ఎన్నోరాత్రులు సావిత్రి, తన రక్తాన్ని వేడెక్కించి, ఉడికించి తనని తృప్తిపఱచకుండానే తను మాత్రం నిద్రపోయింది....రాత్రి.... యస్. రాత్రి జరిగిన సంఘటన తనకి నిజంగా పిచ్చెక్కించింది.

నిన్నంతా ఎంతో ఉత్సాహంగా గడిచింది....నిన్న ప్రిన్సిపాల్ తనతోటి లెక్చరెర్స్ ముందు స్టాఫ్ మీటింగ్‌లో "రాజారావు....ఎనైస్‌బోయ్....ఇంత చిన్న వయస్సులోనే అద్భుతంగా టీచ్ చేస్తున్నా"డని మెచ్చుకున్నాడు. క్లాసుల్లోకూడా నిన్నంతా ఎన్నడూ లేనంత గొప్ప ఉత్సాహంతో గడిచింది... బాగా జోక్స్‌చేసాడు. విద్యార్థుల్ని యే వందసార్లో గొల్లుమని నవ్వించాడు. ఎన్నడూ నిండుగానవ్వని అందగత్తె సుజాత నిన్న పగలబడి, విరగబడి నవ్వింది. (ఆసుజాతంటే తనకిష్టం.... నిన్న ఎందుకో చాలా అందంగా కన్పించింది.) ఎందుకో మనస్సు యేయే లోకాలకో తేలిపోయింది....అదే ఉత్సాహంతో యింటికొచ్చాడు. సావిత్రి తన కిష్టమైన పాల వెన్నెల నురుగుల్ని విరజిమ్ముతున్న తెల్లచీర కట్టుకొంది....తలలో కొల్లలు కొల్లలుగా మల్లెలు పెట్టుకొంది....(తనకి తెల్ల చీరన్నా, మల్లెపూలన్నా చచ్చేయిష్టం.) ఎన్నడూ లేనంత జగదేక మోహనంగా కన్పించింది సావిత్రి....ఆమెకి యేవేవో విషయాలు చెప్పాడు....కాలేజిలో ప్రిన్సిపాల్ తనని మెచ్చుకున్న విషయం....తనుక్లాసులో ఎలా ఎన్నడూ నవ్వని సుజాతని నవ్వించిన విషయం ...మళ్ళాయెన్నో జోక్స్‌వేసాడు.... సావిత్రినికూడా బాగానవ్వించాడు. సావిత్రిలో ఎప్పుడూ ఉండే ఆ "అంటీ అంటని" తనాన్ని చాలావరకు పోగొట్టాననుకున్నాడు. అలా మాట్లాడుతుండగానే రాత్రి అయ్యింది... తన ఉత్సాహంలాగే బయటంతా వెన్నెల పరచుకొంది.... వెన్నెలంటే తనకి ప్రాణం....సావిత్రి ఆ తెల్ల చీరలో, ఆ మల్లెపూలలో, వెన్నెలతో పోటీ చేస్తున్నట్లనిపించింది. ఆ వెన్నెల్లో గంతులు వెయ్యాలనిపించింది. దొర్లాలనిపించింది. ఆ వెన్నెట్లో సావిత్రితో, యేవో మధురమైన కబుర్లు చెప్పుకుంటూ.... ఊర్వశీ పురూరవుల్లా విహరించాలనిపించింది ...సావిత్రి అందంలో, సావిత్రి గుండెల్లో అంతమవాలనిపించింది.... సావిత్రిలో ఉండే ఆ మాయని శోధించాలనిపించింది.

"ఈ రోజు....ఇంటివెనుక, వెన్నెట్లో పడుకుందామ"ని ప్రతిపాదించాడు.

"అసహ్యంగా ఉంటుంది....పక్కింటివాళ్ళుచూస్తారు"

"చూస్తే భయమా? మనిద్దరం శాస్త్రోక్తంగా ఐదారు వందల మంది ముందు పెళ్ళి చేసికున్నాం...."

"పెళ్ళి చేసికున్నామని బజార్లో పడుకుందామా?"

"ప్లీజ్ సావిత్రి....ప్లీజ్....ఈ రోజు నామాట కాదనకు. ఆ వెన్నెలని చూస్తోంటే, నిజంగా నామనస్సు పరవశించిపోతుంది....నీతో అలానిండు వెన్నెల్లోపడుకొని.... నిన్నూ వెన్నెల్నీ తనివి తీరా...." తర్వాత చెప్పలేకపోయాడు. (సావిత్రి అంటే తనలో ఒక విధమైన భయంలాంటిది ఉందని తనకి అప్పుడప్పుడనిపిస్తుంది)

"చాల్లెండి....ఎవరన్నా వింటారు"

"ప్లీజ్ సావిత్రి....ప్లీజ్....ఈ ఒక్క రోజు...." ప్రతిమాలాడు. సావిత్రి ఒప్పుకొంది. ఆక్షణంలో సావిత్రంటే తనలో ఎంత ప్రేమ ఉప్పొంగిందో....ఇన్నాళ్ళూ సావిత్రిని అపార్థం చేసికున్నాననుకున్నాడు. అలాచేసికున్నందుకు తను ఉత్తపూల్ అనుకున్నాడు సావిత్రి తన ఆరాధ్య దైవం అనుకున్నాడు.

వెన్నెట్లో మంచం వేసింది సావిత్రి ...పడుకున్నారు ...తామప్పుడు సాక్షాత్తు ఊర్వశీపురూరవులే అనుకున్నాడు. చాలాసేపు చుట్టుప్రక్కల వాళ్ళెవరైనా చూస్తున్నారేమోనని సావిత్రి భయపడింది. "ఎవరైనా చూస్తే కాల్చిపారేసాన"న్నాడు తను జేమ్స్‌బాండ్ సీన్‌కానరిలా పోజ్‌పెడ్తూ....

సావిత్రితో తియ్యగా, తన అంతరాంతర జ్యోతిస్సీమల్లో ఎంత కాలంగానో మెదులుతున్న యెన్నో భావాలని చెప్పుకోవాలనిపించింది.

"ఈ వెన్నెలనిచూస్తే ఏమనిపిస్తున్నది సరూ" అన్నాడు.

(సావిత్రిని "సరూ"! అని పిలవాలని తన కోరిక ... కాని అలా పిలిస్తే "తన కసహ్యం....సావిత్రనే పిలవాలం"టుంది సావిత్రి .... ఇప్పుడు సరూ అని పిల్చినా యేమి అనకపోవటం తనకి బోలెడు ధైర్యాన్నిచ్చింది)

"ఏముంది....రోజూ ఉండే వెన్నెలేగా?" సావిత్రి.

"అంతేనా ...పిచ్చిసరూ! ఇంత మధురాతి మధురమైన నిండు వెన్నెల, యే దేవతో, మన కోసం కరుణించి పంపించిన ఈ కమనీయ వెన్నెల్ని....రోజూ

ఉండేదేగా అని తీసిపారేస్తున్నావు....చలం గారన్నట్లు ప్రకృతి ప్రసాదించిన కొన్ని అతిరమణీయ వస్తువులు రోజూ కన్పించటం వల్ల ఎంతమామూలైపోయాయో ఈ మానవాళికి"

"ఏమిటో బాబు....మీరు ప్రతీదాన్ని యేదో బ్రహ్మాండంచేసి మాట్లాడుతారు....నాకేం అర్థంకాదు"

"బ్రహ్మాండంకాదు సరూ! బ్యూటీ...సౌందర్యం....ప్రపంచంలోకొన్ని అతిసుందరమైనవస్తువులున్నాయి. వాటిని చూస్తే నన్ను నేను మఱచిపోతాను....సూర్యోదయాన్ని చూసినా, సూర్యాస్తమయాన్ని చూసినా, నిండు మేఘాల్ని చూసినా, పండు వెన్నెల్ని చూసినా నా హృదయం ఒక అలౌకికానందంతో నిండిపోతుంది, ఏవేవో దివ్య సుందర లోకాలునాకు కనిపిస్తాయి....అలా ఆ గొప్ప అనుభూతుల్ని అనుభవిస్తున్నప్పుడు నీతో ఉండాలని....నీలో ఐక్యమవ్వాలని....నీ గుండెల్లో గూడుకట్టుకోవాలని .... ఒక్క మాటలో నువ్వూ నేనూ శాశ్వతంగా యేకమైపోవాలని............"పైకి ఆకాశంలోకి నక్షత్ర మండలంలోకి, యేదో చెప్పలేని హాయిని చెప్పటానికి ప్రయత్నిస్తునాడు.... ఎందుకో అకస్మాత్తుగా సావిత్రి తన మాటలు వినటంలేదని అనుమానం వచ్చింది .. మనస్సు చివుక్కుమంది....నిండు అమృతకలశంలో విషబిందువులు పడ్డట్లు ....

"సావిత్రి....సావిత్రి....నిద్రపోతున్నావా?" అన్నాడు గట్టిగా, ఆతురతగా, బాధగా....

"ఎందుకలా అరుస్తారు....మీధోరణి ఎప్పటికి పూర్తవుతుందోనని అలా కళ్ళుమూసి కున్నాను". ఎంత తేలికతనం.... ఎంత నిర్లక్ష్యం....ఎంత అహంకారం....

"ఇదంతా....ఉత్తధోరణిలా అనిపిస్తున్నదా? ఐయామ్ సో సారీ....నిన్ను విసిగించినందుకు". గుండెలు బరువెక్కుతుంటే, కళ్ళల్లోనీళ్ళు ఉబికి వస్తోంటే, కంఠం రుద్ధమౌతోంటే అన్నాడు.

"మీ కెన్నిసార్లు చెప్పానండి ... ఈ కవిత్వం, ఈ సోరీ నాకిష్టముండదని....ఐనా ఎప్పుడూ మీరు ఇలాగే మాట్లాడుతారు....నాకు నిద్రొస్తున్నది బాబు"

తన హృదయంమీద ఎర్రగా కాలుతున్న ఇనుపకడ్డీని అంటించినట్లనిపించింది.... సావిత్రి మనిషికాదు....పాషాణం. ఒక్కసారి నిలువెల్లా కంపించిపోయాడు....యేదో తనకి తెలియని వైపరీత్యమేదో జరుగబోతున్నదనే భయం, యేదో .... యేదో చెయ్యాలన్న మొండి పట్టుదల ఒక్కసారి తనలో జనించాయి ... అకస్మాత్తుగా,

మెఱుపులా ఎప్పుడో మఱచిపోయిన, తన చిన్నప్పుడు భార్యని గొడ్డులాబాదే రామయ్య తనలో మెఱసాడు....యేం చేస్తుందో ఈ అందమైన పశువుని అలా బాదితే....ఆ అందమైన పెదవుల్ని ఆపిల్ పండుని కొరికినట్లుగా కొరికి, రక్తం ప్రవహింపజేస్తే యేంచేస్తుందో? ఆ కొప్పులో పెట్టుకున్న మల్లెలు ముక్కలు ముక్కలుగా, రాలి నలిగిపోయేలా, ఆ కొప్పుపట్టి ఈడ్చేస్తే యేంచేస్తుందో? ఆ కోమలమైన చెక్కిళ్ళని.... నల్లగా, అసహ్యంగా కందిపోయేలా వాయిస్తే, యేంచేస్తుందో? ఆమెఒంటికి, యవ్వనానికి అతుక్కుపోయిన ఆ జాకెట్‌ని చించేసి, పీకేసి....లోపలవేసికున్న బ్రాని త్రెంచేసి....రాక్షసుడిలా....హిరణ్యకశ్యపుడి రక్తం త్రాగిన నరసింహుడిలా.... ఆమె రక్తాన్ని త్రాగి వీరవిహారంచేస్తే యేం చేస్తుందో? వెన్నెల నురుగుల్ని విర జిమ్ముతున్న తన కిష్టమైన ఆ తెల్లచీరని, ముక్కలు చెక్కలుగా కోసేసి....ద్రౌపది చీరలాగిన దుశ్శాసనుడిలా....ఆమెని అవమానపఱచి, తనకెప్పుడూ దూరంగా, ఎండ మావిలాఉంచుతున్న ఆ అందాన్ని బట్టబయలుచేసి, వికటాట్టహాసం చేస్తే యేం చేస్తుందో తెలిసికోవాలనిపించింది. ఆ అందమైన గొంతుని...."నయాగరా''సినిమాలో జోసెఫ్ కాటెన్, మార్లిన్ మన్రోగొంతు నులిమి చంపినట్లుగా....నులిమి చంపెయ్యా లనిపించింది. ఒక్క మాటలో సావిత్రిని ఆ క్షణంలో సర్వనాశనం చెయ్యాలని పించింది. కాని పిచ్చివాడిలా అలా స్తంభించిపోయాడు. తనలోని యేదో ఒక అతి బలీయమైనశక్తి తనలో అప్పుడు అలా భయంకరంగా ఉవ్వెత్తున ఉప్పొంగిన ఆ విపరీతకోర్కెలకి అడ్డు నిలిచింది.

తన మీద తనకి అసహ్యం కల్గింది ...తను ఎన్నిసార్లో ఎంతో గాఢంగా చెయ్యాలనుకున్నపనుల్ని చెయ్యలేకపోయాడు..యేవోవెధవ డెలికసీస్ అడ్డొస్తున్నాయి... నిజంగా తనలాచేస్తే యేంచేసేదో సావిత్రి....గింజుకునేదా? గట్టిగా అఱచేదా? తనంటే ఎప్పుడూ ఉండే నిర్లక్ష్యం, ఆ తేలికభావం యేమైపోయేవో? రామయ్య బాదుతోంటే పెద్దగా, అసహ్యంగా, నిస్సహాయంగా అఱచే అతని భార్య గుర్తొచ్చింది .. సావిత్రి అలా అరుస్తోంటే చూడాలనిపించింది. పక్కింటి వాడెవడైనా అడ్డమొస్తే "నాపెళ్ళాన్ని....కొట్టుకుంటాను ..చంపుకుంటాను....నీ పెళ్ళాంజోలికి రాలేదుగా..." అంటాడు రామయ్యలా....ఎందుకో ఆక్షణం ఆ రామయ్య చాలాగొప్పవాడనిపించాడు. తప్పకుండా తనకంటే గొప్పవాడే....సందేహంలేదు....

రాజారావు కాలేజి ఆవరణలో అడుగుపెట్టాడు....శరీర మంతా చెమటలు కారుతున్నాయి....దస్తీతో తుడుచుకున్నాడు....దస్తీ .... ఇదివరకే దర్టీగాఉంది.... శుభ్రమైన దస్తీ....తన జన్మకి గగన కుసుమమే....ఆఫీస్‌కెళ్ళి రిజిష్టర్లో సంతకం చేసాడు....వరండాలో"గుడ్‌మార్నింగ్ సర్" అంటున్న విద్యార్థులకి తెచ్చిపెట్టుకున్న నవ్వుతో విష్‌చేసాడు...స్టాఫ్ రూంలోకొచ్చి తనదెస్క్ ముందుకూర్చున్నాడు... అదివరకే ఆ రూంలోఉన్న ఎకనామిక్స్ లెక్చరర్ రఘుపతి, హిష్టరీ లెక్చరర్ శ్రీధర్‌రావు చదువుకుంటున్నారు....తనకి నెక్స్ట్ పీరియడ్ ఫైనలియర్ క్లాసుంది.... ఈరోజు హెగిల్ స్టార్ట్‌చేస్తానన్నాడు....ఎంతో ప్రిపేర్ కావాలి....ఇంటిదగ్గర చదువుదామనుకున్నాడు .... కాని ఇంటిదగ్గర ఒక్కక్షణమైనా పీస్ ఆఫ్ మైండ్ ఉంటేనా? టెక్స్ట్ బుక్ తెఱచి ఎదురుగా కూర్చొన్న రఘుపతికేసిచూసాడు....అతన్ని చూడగానే రెండు మూడు రోజులుగా అతన్ని ఓ పది రూపాయలు అప్పడగాలన్న విషయం గుర్తొచ్చింది .... "వచ్చేటప్పుడు బొగ్గులు తీసికురాకపోతే రాత్రికి వంటసున్న" బొగ్గులు....బొగ్గులు... బొగ్గులంటే తనకి చచ్చే అసహ్యం .... ఎప్పుడూ బొగ్గులు తెమ్మనే చెప్పింది తనతో....ఒక్కసారైనా "వచ్చేటప్పుడు మల్లెపూలు తెమ్మనో.... సన్నజాజులు తెమ్మనో....పారిజాతాలు తెమ్మనో....కోమలంగా,గోముగా తన హృదయం మీదవాలి చెప్పిందా? బొగ్గులు....బొగ్గులు తెమ్మందే గాని....జీవితం బొగ్గులైపోయింది ...అప్పుడే పది పంక్తులు చదివాడు....ఒక్క అక్షరమైనా అర్థం కాలేదు....వెధవ అబ్‌స్ట్రాక్ట్ ఫిలాసఫీ....ఇప్పుడర్థమౌతుందా? ఏమిటో ఆలోచనలు.... తనకి పిచ్చి సెంటిమెంట్స్ చాలాఉన్నాయి....ఎప్పుడో చదువుకునే రోజుల్లో తన రక్తంలోకి యెక్కి తనలో జీర్ణించుకుపోయాయి....ఇంకా జీవితం అంటే మల్లెపూలు, సన్నజాజులనే భ్రమపోవటం లేదు....జీవితమంటే బొగ్గులని యింకా తెలిసికోలేకపోతున్నాడు .... "ఈ కవిత్వం, ఈ సోదె నాకిష్టంలేదని ఎన్నిసార్లుచెప్పాను" ఎన్నిసార్లు చెప్పిందో....కాని తనకి బుద్ధొచ్చిందా? వెధవ సెంటి మెంట్స్... తనని వీడటంలేదు.. .మగవాళ్ళకంటే ఆడవాళ్ళకి ఎక్కువ సెంటిమెంట్లు ఉంటాయనుకొనేవాడు తను .... కాని సావిత్రికి సెంటిమెంట్లులేవు....అదో అందమైన పాషాణం ... ఎంతసేపూ విశ్వప్రసాద్, టెంపోరావు క్రైమ్‌థిల్లర్స్ చదివే ఆ పాషాణానికి తన ఆ అతిసున్నితమైన అతికోమలమైన సెంటి మెంట్స్ఎలా అర్థం ఔతాయి.... ఆ చెత్తపుస్తకాలు చదవొద్దని లక్షసార్లు చెప్పాడు. కాలేజిలైబ్రరీ నుంచి చలంగారి

పుస్తకాలు తెచ్చిచ్చాడు .... తనకి శరత్ బాబు స్త్రీ పాత్రలంటే చాలా యిష్టమని చెప్పాడు ... ఆ రోజుల్లో తనకి కాబోయేభార్య శరత్‌బాబు సృష్టించిన స్త్రీలాగుండాలని కలలుకనే వాణ్నని చెప్పాడు.... (అలా చెప్పితేనన్నా సావిత్రి ఆ పుస్తకాలు చదివి తనకిష్టమైనట్లు మారుతుందేమోనని ఆశించాడు. కాని తన అన్ని ఆశల్ని అడియాసలు చేసింది సావిత్రి.... సావిత్రి.... ఈ రోజు ఒక్క క్షణంకూడా తనని వీడటంలేదు .... హీగల్ .. ఈ స్థితిలో హీగల్‌ని అర్థం చేసికోగలడా? గుండెల్లో మంటలు.... బుర్రలో తుఫాన్.... మనస్సంతా బొగ్గులు ... బొగ్గులు ... ఇంటికి వెళ్ళేటప్పుడు బొగ్గులు తీసి కెళ్ళకపోతే రాత్రికి తిండిలేదు.... "నన్ను చేసికుండి ఆకలితో చంపటానికా?" అని నిలదీసి అడుగుతుంది సావిత్రి ... ఠంగ్ ఠంగ్‌మని బెల్ వినిపించిది .... బెల్ ఐపోయింది ... తనేం ప్రిపేర్ కాలేదు ... ప్రిపేర్ కాకుండా క్లాసుకి వెళ్ళాలంటే తనకి చాలా భయమేస్తుంది—అందులో వెళ్ళాల్సింది ఫైనలియర్ క్లాసుకి ... ఫైనలియరనే గర్వంజాస్తివాళ్ళకి ...యే కొంచెం పొరపాటైనా గోలచేస్తారు ... పిల్లికూతలు, కుక్క అరుపులు ... మొన్నకొత్తగావచ్చిన ఇంగ్లీషు లెక్చరర్ అలా నవ్వులపాలయ్యాడట .... అందుకే తనకాక్లాసంటే చాలా భయం ... ఆ క్లాసులో సరళనే అమ్మాయి ... చాలా తెలివిగలది (చాలా అందమైందికూడా....సరళన్నా తనకిష్టమే .. ఆ క్లాసుకివెళ్ళి నప్పుడల్లా ఆ అమ్మాయికేసి వో పదిసార్లుఅయినా చూస్తాడు) ప్రతీసారి యేమైనా ప్రశ్నలడుగుతుంది.... ఈ రోజుకూడా అడుగుతుంది. తను చెప్పలేకపోతే క్లాసులో నవ్వులపాలౌతాడు .. తన బ్రతుకుని కాలేజిలోకూడా నవ్వులపాలుచేస్తున్నది సావిత్రి... సావిత్రి .... తనలో ఎంత కల్లోలాన్ని రేపుతున్నది — రిజిష్టర్ తీసికొని క్లాసుకి బయిల్దేరాడు.... అటెండెన్స్ తీసికున్నాడు .. ముచ్చెమటలు పోస్తున్నాయి ఎక్కడో చిన్నగా వణుకుకూడా ప్రారంభమైనట్లుంది. తను ఎప్పుడూ యే క్లాసులోను సరిగ్గా చెప్పలేడనుపించుకోలేదు ... ఈ రోజు ఆ పేరు రాబోతోంది ... గుండెలు వేగంగా, బయటవాళ్ళకి విన్పించేటట్లుగా కొట్టుకుంటున్నాయి చెమటలు కారుతున్నాయి ... అటెండెన్స్ రిజిష్టర్ మూసేసాడు—ఏదో మాట్లాడాలి .. వెంటనే ఒక ఐడియా వచ్చింది బుర్రలోకి—

"టుడే లెటజ్ టేక్ సమ్ జనరల్ టాపిక్ ...." అనబోయాడు.

"ఇవ్వాళ్ళ హీగల్ స్టార్ట్ చేస్తామన్నారు ..." సరళ

"అఫ్‌కోర్స్ ... బట్ ...." అంటూ యేదో గొణిగాడు ...

"అఫ్‌కోర్సు....బట్....ప్రిపేర్ కాలేదు" వెనుక బెంచీలోకూర్చున్నవాడెవడో తన కంఠాన్ని చక్కగా అనుకరిస్తూ తనలాగే అన్నాడు...అంతా గొల్లుమని నవ్వారు. (అందరితోపాటు సరళకూడా నవ్వింది.) మనస్సు చివుక్కుమంది...ఆ అవమానాన్ని భరించలేకపోయాడు.

"డోంటాక్ నాన్‌సెన్స్....ఆల్‌రైట్....ఐవిల్‌స్టార్ట్ హిగల్" అన్నాడు లేనిధైర్యాన్ని తెచ్చుకొని....క్లాసులో మళ్లీ నిశ్శబ్దం. ఒక నలుబై నిముషాలు....యేదో నానా చెత్త వాగాడు....యే పదిసార్లో మాటల కోసం తడుముకున్నాడు....చెప్పిందే చెప్పాడు.... తన మాటలు తనకే అసహ్యంగా, విసుగ్గా తోచాయి—ఆ నలుబై నిముషాలు ఒక విధమైన చిత్రవధని అనుభవించాడు.... తన లెక్చర్ ఎన్నడూ అంత ఘోరంగా, చప్పగా, విసుగ్గాలేదు....స్టూడెంట్స్ కావాలని ఆవులించటం, గుసగుసలు పెట్టు కోవటం....నవ్వటం గమనించాడు.. తల తీసేసినంత అవమానాన్ని పొందాడు.... తనకేసి జాలిగాచూస్తున్న సరళ చూపుల్ని భరించలేకపోయాడు....బెల్ విన్పించటంతో ఆ నరకం నుంచి బయటపడ్డాడు... తను బయటికెడ్తుంటే "ప్రిపేర్ కాకుండా వచ్చాడురా?" అనటం విన్పించింది....మనస్సంతా ఉడికిపోయింది.... ఆ స్టూడెంట్స్ మీద, ఆ కాలేజి మీద, లెక్చరర్ ఉద్యోగంమీద, పొలిటికల్ సైన్స్‌మీద అంతులేని ద్వేషం జనించింది....నిన్ననే ప్రిన్సిపాల్ మెచ్చుకున్నాడని ఎంతో మురిసిపోయాడు... తను మంచి లెక్చరర్ అన్పించుకోవాలని, అందుకు ఎంత శ్రమైనాపడాలని నిన్ననే అనుకున్నాడు....కాని ఇవ్వాళ్ళే ఈఘోరం....ఈపరాభవం....ఇన్నాళ్ళుపడ్డశ్రమంతా వృథా ఐపోయింది....ఇన్నాళ్ళు ఇంతబాగాచెప్తున్నా ఈ ఒక్కరోజు సరిగ్గా చెప్పక పోతే ఆ వెధవలలా గోలచేస్తారా? అసలు దీనికంతా కారణం సావిత్రి....తన బుర్రలో తుఫాన్ రేపింది....మనస్సు నిండా అంతులేని కల్లోలాన్ని రేపింది.... స్టాఫ్ రూంకొచ్చి కూర్చున్నాడు రాజారావు.

ఎందుకో ప్రపంచమంతా తనని చూసి నవ్వుతున్నట్లనిపించింది....బొగ్గులు లేకుండా ఇంటికెడ్తే "నన్ను పస్తుంచి చంపుతారా....ఇందుకే చేసికున్నారా....తిండి లేకుండా ఆకలితో అలమటిస్తూ మీ వద్ద ఉండటానికి నేనేం మీ బానిసను కాను.... మా పుట్టింటికి వెళ్ళిపోతున్నాను" పుట్టింటికి వెళ్ళిపోతుంది....ఆ తర్వాత ఎవడితో నైనా లేచిపోతుంది....బాగాడబ్బున్నవాణ్ని చూసికొని....అప్పుడు తనని లోకమంతా

"ఇదిగో....ఫలానా లేచిపోయినామె భర్త ఇతడే'' నంటూ తన వెంటపడ్తుంది.... అంతా తనని పెళ్ళాన్ని అదుపులో పెట్టుకోలేని చవట అంటారు....కాకుల్లా, గద్దల్లా తనని పొడుస్తారు....ఇప్పటి స్టూడెంట్స్ ఆ విషయం గోడలమీద రాసి తను కన్పించగానే కుక్కల్లా, నక్కల్లా అరుస్తారు....అది భరించగలడా తను....గుండెల్ని కోసివేసే బాధ... గుండెల్ని నులిమివేసేబాధ....కడుపులోని పేగుల్ని కదిలించేబాధ.... ఇక కూర్చోలేడు....ఎక్కడికైనా పారిపోవాలి....ఇంటికెళ్తే సావిత్రి గుండెలకు హత్తుకుంటుందా? తన ఒడిలో పడుకోబెట్టుకొని ప్రపంచాన్ని మఱచిపొమ్మని ఓదారుస్తుందా? 'బొగ్గులు తెచ్చారా' అని అడుగుతుంది. "లేదండీ. '' "గెటవుట్'' అంటుంది. "పోషించలేని వాడివి ఎందుకు చేసికున్నావ''ంటుంది హింసిస్తుంది.... అపహాస్యం చేస్తుంది....అవమానిస్తుంది ...ఇప్పటి స్టూడెంట్స్‌లాగే...సమాజంలాగే... కాకుల్లా గద్దల్లా తనని పొడుస్తుంది .... చివరకి తనని వదిలేసి వెళ్ళిపోతుంది .... ఎవడితోనైనా లేచిపోతుంది .... లేచిపోతుందా? తన సావిత్రి లేచిపోతుందా .... నాస్టీ....నాస్టీ ఐడియా....మనస్సు కల్మషమైనప్పుడు అన్నీ ఐడియాలే....ఏమైనా సావిత్రి తనగుండెల్ని పిండిచేస్తున్నది....ప్రాణాల్ని హరించివేస్తున్నది....గొంతు నులిమి చంపుతున్నది....ఆనాటి సావిత్రి తన భర్తని బ్రతికించుకొచ్చిందట .. తన సావిత్రి మాత్రం తనని తీసికెళ్ళి యమధర్మరాజుకి అప్పగిస్తుంది ...సావిత్రి ... తనకి తెలియకుండానే తన పిడికిళ్ళుబిగించాడు....

"క్లాసు కెళ్ళొచ్చారా...." అంటూ రఘు పతి ప్రవేశించాడు

"ఆ! వెళ్ళొచ్చాను" వెంటనే రఘుపతిని అప్పడగాలన్న విషయం జ్ఞాపకంవచ్చింది... ఇస్తాడా? రఘుపతి దగ్గర ఎప్పుడూ డబ్బు ఉంటుందంటారు .. తన దగ్గర ఎప్పుడూ ఉండదు....డబ్బున్నప్పుడు పిచ్చిగా ఖర్చు పెట్టటం ...తర్వాత బాధపడటం బాగా అలవాటైపోయింది...రఘుపతిని ఇదివరకెప్పుడూ అడగలేదు... ఓ పదిరూపాయలడిగి ఆ బొగ్గులు తీసికెళ్ళి సావిత్రి మొహాన పారేస్తాడు— .(నిజంగా బొగ్గులు మొహాన పోస్తే సావిత్రి మొహం ఎలాఉంటుందో...నల్లగా—అసహ్యంగా—తను అందమైన దాన్నని ఎంత గర్వం) కాని రఘుపతి అప్పిస్తాడా అని—ఎవరైనా అప్పడిగినప్పుడు వాళ్ళు లేదంటే ఎంతో అవమానం జరిగినట్లు బాధపడ్తాడు— ఆ రోజంతా అదే మనస్సులో మెదుల్తుంది.....ఐనా రఘుపతి యిస్తాడు.....అతని దగ్గర పదిరూపాయలు తప్పకుండాఉంటాయి...తను అడిగాకలేవంటాడా? తనంటే కొంచెం గౌరవం కూడ.

"ఏమండి... రఘుపతిగారు . ఒక పెన్‌రుపీస్ అప్పిస్తారా? మళ్ళా ఫస్టుకి యిచ్చేస్తాను" అడిగేసాడు. ధైర్యంచేసాడు....క్షణంసేపు నిశ్శబ్దం ...తన గుండెలు వేగంగా కొట్టుకొంటున్నాయి....ఏమంటాడు....లేవంటాడా?

"ఐయామ్ సారీ సార్... నాదగ్గర డబ్బేమీ లేదు....ఐయామ్ సారీ" రఘుపతి....తన ముఖం వెలవెలపోతోంది.

"ఇట్స్ అల్‌రైట్" అంటూ గుణిగాడు

"ఐనా మీకెందుకండీ అప్పు....మీరిద్దరేగా....ప్రతీనెలా బోలెడు నిలువచెయ్యవచ్చు... మీరే మాకివ్వాలి....మాలాంటి పిల్లలుగలవాళ్ళకి........." రఘుపతి నవ్వుతూ అంటున్నాడు....

"లాస్టువీక్ కదండి....కొంచెం అవసరం పడింది"

"ఫస్టువీక్‌లోబాగా ఖర్చుపెట్టి లాస్టువీక్‌లో అప్పులకి పరిగెత్తటం యేమిటండి.... డబ్బు జాగ్రత్తగా నెలంతా వచ్చేట్లువాడుకోవాలి...." రఘు పతి యింకేమో చెప్ప పోతున్నాడు....డబ్బివ్వకపోతే యివ్వకపోయాడు....సలహాలు ఎవడివ్వమన్నాడు.... ఇట్లాంటి సలహాలంటే తనకి భలే అసహ్యం ...బుద్ధితక్కువై వీడ్ని అప్పడిగాను.... "సరే....అవన్ని నాకుతెలుసులెండి" అంటూలేచాడు....ఎందుకో అతనికెదురుగా ఇక కూర్చోవాలనిపించలేదు ... వెధవ ఎకనామిక్స్ .... ఎవడివ్వమన్నాడు వీడ్ని సలహాలు....బోడిసలహాలు....ఫస్టువీక్ తనుదుబారాగాఖర్చుపెట్టి లాస్టువీక్‌కి అప్పులకు పరుగెత్తుతున్నానని అంటాడా?...ఎంత అహంకారం..తనంటే ఎంత తేలిక భావం.... అసలువాడికి తనంటే చాలా ఈర్ష్య... నేనొచ్చిన సంవత్సరంలోపలే విద్యార్థుల్లో చాలా పాప్యులర్ అయ్యానని....వాడుపదేళ్ళుగా పనిచేస్తున్నా క్లాసుల్లో యింకా యేడ్పిస్తారుట....పైగా తనని నిన్న ప్రిన్సిపాల్ మెచ్చుకున్నాడు....అది రఘు పతి లాంటివాళ్ళకి కడుపుమంటగా ఉంది—వాడిదగ్గర డబ్బుంది....కావాలని, తనకివ్వ కూడదని యివ్వలేదు. పైగా వాడిబోడి సలహాలు....కేవలం తనని తేలికచెయ్యాలనే దృష్టితో, అవమానించాలనే ఉద్దేశ్యంతో....ఛీ. ఛీ. ఛీ ... ఈ రోజంతా ఇలాగే గడిచింది....ఎక్కడా అవమానమే....ఎక్కడా అపహాస్యమే ...దీనికంతటికీ సావిత్రి కారణం ...వెధవ బొగ్గులు లేకుండా ఒక్కరోజు గడపలేదా....అంత ఖచ్చితంగా, అంతపుల్ల విరిచినట్లుగా బొగ్గులు తెమ్మని చెప్పకపోతేయేం ...

రాజారావు ఇంటివైపుగా నడుస్తున్నాడు...ఇదేమిటి .... అప్పుడే ఇంటి కెళ్తున్నాడు ...ఇప్పుడు మూడే అయ్యింది....నాల్గింటికికదా యింటికెళ్ళాల్సింది.... ఇప్పుడు ఇంటికెళ్ళి యేం చేస్తాడు .... సావిత్రి ముందు ఎలానిల్చుంటాడు.... "బొగ్గులేవి?" అంటుంది. "తేలేక పోయాన"ంటే "ఎందుకు మీ జన్మ"అంటుంది. ఇంత మాత్రానికి మీకొక భార్య.. .మీకొక కాపురం ...ఎందుకంటుంది ...తనలాంటి వాడికిచ్చి తన పుట్టింటివాళ్ళు తన గొంతుకోసారంటుంది....ఈ మాటలన్నీ తను భరించగలడా? ఇప్పటికే గుండెలు నీరై పోతున్నాయి ...క్లాసులో నవ్వులపాలయ్యాడు... రఘుపతి ఎదుట నవ్వులపాలయ్యాడు– అంతా సావిత్రి కారణంగా...సావిత్రి..సావిత్రి తనని మల్లెల పాన్పుమీద పడుకోబెడ్తుందనుకున్నాడు....ప్రపంచాన్ని మరిపిస్తుందను కున్నాడు....అమృతం తాగిస్తుందనుకున్నాడు....కాని....ఇదేమిటి...ఇంత దుర్భరమైన బాధకి గురిచేస్తోంది....తనేం పాపంచేసాడు—ఇంత నిర్దాక్షిణ్యమైన హింసకి తను అర్హుడా? అందరిలా తనుసుఖంగా గడపలేడా? సావిత్రి తన పాలిటదేవత అను కున్నాడు....కాని తనపాలిటి దయ్యమైకూర్చుంది.... తనపాలిటి రాక్షసి సావిత్రి.... ఆ రాక్షసిని ఇప్పుడెలా ఎదుర్కోవాలి....సావిత్రిలో ఎప్పుడూఉండే ఆగర్వాన్నిచూస్తే తనకి ఎందుకో భయం....ఎన్నిసార్లో అనుకున్నాడు అలా భయపడకూడదని.... యెన్నిసార్లో అనుకున్నాడు ఆ గర్వాన్ని ఎలా అణచెయ్యాలాఅని.... కాని ఎప్పుడూ సావిత్రిచేతిలో అవమానాన్నే పొందుతున్నాడు ...ఈ రోజంతా అవమానమే.... క్లాసులో.. తనక్లాసులో మొదటిసారిగా స్టూడెంట్స్ గొల్లుననవ్వారు....ఇదివరకు స్టూడెంట్స్ తనని లైక్ చేస్తారని కొంత గర్వంగా ఉండేది ...ఈరోజుతో అది ఉత్త భ్రమేనని తేలిపోయింది....రఘుపతికి తనంటే కొంత గౌరవం ఉందనుకునేవాడు.... కాని అతడికి తనంటే ఈర్ష్య, ద్వేషంతప్ప యేమీలేవు .. తనంటే ఎవడికీ గౌరవం లేదు .. అందరికీ తేలికభావమే ... అసలు చేసికొన్న భార్యకే తనంటే గౌరవం లేకపోతే బయటవాళ్ళకెందుకుంటుంది ...తనంటే సావిత్రికి ఎంతతేలిక భావం ... తనో పిచ్చివాడనుకుంటుంది కాబోలు .. సావిత్రి తనని విడిచేసి ఎవరితోనైనా లేచిపోతే ..మళ్ళీ ఇదే ...నాస్టీఖాట్....లేచిపోతే ... ఈ పిచ్చివానితో కాపురం చేసే దేమని . లేచిపోతు దా?...తనచిన్నప్పుడు తనఊళ్ళో సోమయ్య...అమాయకుడు... వాడిభార్య లేచిపోవటం.... "సోమయ్య అమాయకుడు....చేతకానివాడు...అందుకే అది లేచిపోయింది" అన్నారంతా తన నలాగే అంటారేమో....లేచిపోతుందా....తనకి

తెలియకుండానే పళ్ళుకొరికాడు లేచిపోతుందా? ...చంపేస్తాడు....తనంటే యేమను కుంటుందో....తన తడాఖా చూపిస్తాడు

రాజారావు వేగంగా నడుస్తున్నాడు...ఇంకా అరఫర్లాంగ్ నడవాలి...వెళ్ళేటప్పటికి సావిత్రి యేంచేస్తుంటుందో....యే విశ్వప్రసాద్ గాడి నవలో చదువుతుంటుంది.... లేకపోతేముస్తాబౌతుంటుంది .. ఎవరికోసం... తనకోసం కాదు...ఎవడికోసం మరి... ఒక్కసారైనా తనకోసమని చెప్పిందా...తన కిష్టమైనపూలు పెట్టుకుందా? 'నారాజా!' అంటూ తనని హృదయానికి హత్తుకుందా? ఎండమావి....సావిత్రి ఎండమావి.... తను వెర్రిగా పరుగెత్తుతున్నాడు ఆ ఎండమావికోసం ...అలాపరుగెత్తుతోంటే తనని చూసి హాయిగా నవ్వుకుంటోంది సావిత్రి....మరి తన కోసంకాకపోతే సావిత్రి ఎవడికోసం ముస్తాబౌతుంది.... ఏమో.... ఎవడున్నాడో.... తనకేం తెలుసు.... నాన్సెన్స్....ఇవ్వాళ్ళన్నీ ఇట్లాంటి వెధవభావాలే కల్గుతాయి ...రాజారావు ఇంకా వేగంగా నడుస్తున్నాడు ...తను ఇంటికి వెళ్ళగానే సావిత్రి ముఖంలోకి ఆ తేలిక తనం ప్రవేశిస్తుంది ... "దొగ్గలేవి" అంటుంది.... యేదో తప్పుచేసిన కుర్రాడిని యజమానురాలు అడిగినట్లుగా ... ఛట్ నాన్సెన్స్ ... తనిలా భయపడ్తున్నాడు కాబట్టే సావిత్రి అలా తన మీదస్వారిచేస్తోంది——ఎందుకు తను భయపడటం.... గోలపెట్టుకోవటం దేనికని....నాగరికత, సభ్యత, సంస్కారం, డెలికసీ, స్త్రీలపట్ల తన కుండే గౌరవం... ఇవన్నీ అడ్డొస్తున్నాయి.... ఇవన్నీ ఉత్త నాన్సెన్స్.... తన అసమర్థతని కప్పిపుచ్చుకోవటానికి తను కల్పించుకున్న బురఖాలు....

తన యిల్లు దూరంగా ... కన్పిస్తోంది.... బయట ఒక రిక్షా నిలచిఉంది.... సావిత్రి రిక్షావాడితో మాట్లాడుతోంది.... అకస్మాత్తుగా రాజారావు బుర్రలో యేదో మెరిసింది .. ఔను ... సావిత్రి ఒకసారి తనతో చెప్పింది.... "అరిక్షావాడంటే తన కిష్టమని" యేదో బ్రహ్మాండమైన రహస్యం తెలిసినట్లనిపించింది ... ఇంకా వేగంగా నడుస్తున్నాడు.... వాళ్ళిద్దరూ స్పష్టంగా కన్పిస్తున్నారు ... వాడు ... నల్లగా, మొద్దుగా కండలుతిరిగి నల్లరాతి విగ్రహంలా ... వాడితో పోట్లాడితే తను గెలువగలడా? సావిత్రి నవ్వుతో మాట్లాడుతోంది ... (తనతో ఎప్పుడు అలా హాయిగా నవ్వుతూ మాట్లాడలేదు సావిత్రి) తనలో యేదో వెర్రిఆవేశం ఉవ్వెత్తున లేచింది ...వాళ్ళిద్దరూ తనని చూసారు ... వెంటనే సావిత్రి యింట్లోకి వెళ్ళింది. వాడు రిక్షాతొక్కుకుంటూ

వెళ్ళిపోయాడు. వాళ్ళు తనని చూడగానే వెంటనే అలా వెళ్ళిపోవటం... ఆ దృశ్యంలో దగా, మోసం, కుట్ర స్పష్టంగా కన్పించాయి.... వాళ్ళిద్దరూ తన కళ్ళల్లో కారం జల్లుతున్నారనిపించింది.... ప్రొద్దుటినుండి మండుతున్న తన హృదయం మీద ఆ దృశ్యం పెట్రోల్‌ని పోసింది.... విసురుగా ఇంట్లోకి వెళ్ళాడు. తనేం చేస్తున్నాడో, తనేం మాట్లాడుతున్నాడో తనకి తెలియటం లేదు. ఇప్పుడు అతనొక భయంకర జ్వాల....

"వాడితో ఏం మాట్లాడుతున్నావ్''

"ఏముంది.... ఏమిలేదు." అదే ఆ కంఠంలో, ఆ చూపులో ఎప్పుడూ ఉండే ఆ తేలికతనం, ఆ అహంకారం, ఆ నైర్లక్ష్యం....

"ఏమిటా తలబిరుసు... అడిగిందానికి సమాధానంచెప్తావా లేదా?" గట్టిగాఅరచాడు.

"ఎందుకలా అరుస్తారు.... తాగొచ్చినవాడిలాగ''

"ఔను.... ఇవ్వాళ్ళతాగేవచ్చాను.''

సావిత్రి చెంప ఛెళ్ళుమంది ... ఆమె పరిస్థితి అర్థంచేసుకునేలోగానే యింకో చెంప ... సావిత్రి తప్పించుకోబోయింది ... తన బలమంతా కేంద్రీకరించి అతన్ని వెనక్కితోసింది.... అతడు క్రిందపడబోయి నిలదొక్కుకున్నాడు.... దానితో అతడింకా రెచ్చిపోయాడు ... యింకా విజృంభించాడు. సావిత్రి మూతిమీద గుద్దాడు.... పెదవిపగిలి రక్తంకారింది.... కొప్పుపట్టుకొని ఈడ్చాడు.... జాకెట్ లాగాడు.... గోర్లుగుచ్చుకొని రక్తంకారింది.... గొంతు నులిమాడు.... తల గోడకేసి బాదాడు.... తనివితీరా చెంపలు వాయించాడు ...కుప్పలా కూలిపోయింది సావిత్రి...బూటుకాలితో తొక్కాడు. తన్నాడు.... సావిత్రి కుప్పలా కూలిపోయింది.... అతడు ఆగాడు.... సావిత్రి రామయ్య భార్యలా గొల్లుమని యేడ్వటంలేదు. అసలు సావిత్రికి స్పృహ ఉన్నట్లులేదు....సావిత్రి ముఖంకేసిచూసాడు....సావిత్రిలో ఎప్పుడూ తనకి కన్పించే ఆ తేలికతనం, అహంకారం, నిర్లక్ష్యం లేవిప్పుడు ... జాలిగా, దీనంగా, హీనంగా, నిస్సహాయంగా. వేటగాడి రైఫిల్‌గుండుకి గురైన లేడిలాఉంది. సరిగ్గా సావిత్రిని అలా చూడాలనుకున్నాడు ... ఆ కోరిక తీరింది. గుండెల బరువుతీరింది....హాయిగా నిట్టూర్చాడు రాజారావు.

చర్చావేదిక:

జీవితానుభవంలో హేతువాద దృష్టి

"జీవితానుభవంలో హేతువాద దృష్టి" అనే శీర్షిక క్రింది వచ్చిన సురమౌళి గారివ్యాసం. తర్వాత అందుకు జవాబుగా మరో సంచికలో అట్లూరి రంగారావుగారి వ్యాసం, అందులోనే సురమౌళిగారి సమాధానం- అన్నీ చూసినాను.

సురమౌళిగారి తాత్విక దృష్టిమీద కొంత చర్చజరపడం అవసరమనితోచింది.

" 'ఏమైనా కొటేషన్సు' యివ్వదలచుకొంటే యిక జీవిత అనుభవాలలోనుంచే యివ్వాలి. అలాంటిపని విస్తారంగా చేసినట్లయితే అంతా స్వాతిశయ ప్రకటన అయిపోయే ప్రమాదంకూడా వుంటుంది. ఇది యిలావుండగా జీవితానుభవాలు మూస పోసినట్లు ఒకే రకంగా వుండవు. రకరకాలుగా వుండటమేగాక విభిన్నంగా, వైరుధ్యంగానూ కూడా వుండడంకద్దు." అని సురమౌళిగారు ఆ శీర్షికమీద చర్చను ప్రారంభిస్తూ వ్రాసినారు. స్వాతిశయ ప్రకటన అయిపోయే ప్రమాదంకూడా వుంటుం దంటూనే సురమౌళిగారు పడకుండావుండటం చేతగాక ఆ ప్రమాదంలోనే పడిపోయి అన్నంతపనీ చేసినారు. ఆయన నిలబడుకున్న స్థానం అందుకు కారణం.

ప్రపంచం తన 'ఒక్క'ని కొరకేవుందనీ, తన చుట్టూనే పరిభ్రమిస్తున్నదనీ అనుకొన్నపుడు. historical perspective, objective reality ఎగిరిపోయి, వాటిస్థానే individualist's biographical perspective స్థలం చేసుకుంటుంది. ఇది చాలా అనర్థాలకు, అయోమయతకు దారి తప్పక తీస్తుంది.

ప్రపంచంలో ఏ ఒక వ్యక్తీ తనకుతానుగా లేడు. వ్యక్తి, వ్యక్తి జీవితం, సమాజం. అన్నీ ఒకదానికొకటి సంబంధం కలిగివున్నవి, వాటిలో దేన్నీ ఒక్కటిగా చీల్చి విడిగాచూడడం మంచిదిగాదు. చూస్తే తప్పులు తప్పవు.

సంఘంనుంచీ వేరుపడిన వ్యక్తులు—ఎవరికివారు—అంటే ఎన్నెన్నోరకాల అభి ప్రాయాలు పరస్పర విరుద్ధమైనవీ వుంటాయి. ఈ తత్వం మానవుల విడదీసి, ఒకరి

కొకరు పరాయివాళ్ళుగా చేసితీరుతుంది. సురమౌళిగారి ఆలోచన ఆపరిధిని దాటలేదా అనిపిస్తుంది. ఎవరికివారైతే మానవుడు అయోమయంలో పడిపోతాడు. బలహీనుడై పోతాడు. ఏమి సాధించలేనివాజమ్మగా తయారయి తీరుతాడు. ఒక బొమ్మలా బ్రతుకుతాడు. నా అనుభవాలే నిజం అని ఒకరంటే కాదు నా అనుభవాలే నిజంఅని మరొకరంటారు. వాళ్ళవాళ్ళ అనుభవాలు లెక్కించుకుంటూ ఎవరికి వారుగా వుండిపోతారు వాస్తవానికి యిద్దరికీ ఏది వాస్తవమో వ్యక్తిగతాభిప్రాయాల విసర్జించకుండా తేల్చుకోవడం కష్టం.

ఒకవ్యక్తి పుట్టీపుట్టడంతోనే ఒక సామాజిక వాతావరణంలో ప్రవేశిస్తాడు, అతని పుట్టుకకుముందే అది అమలులోవుంది. అతనికది యిష్టమున్నా లేకున్నా, కష్టమైనా, సుఖమైనా తనకు స్వతంత్రించివుండి కొన్ని నియమాలప్రకారం నడుస్తూ వుంటుంది, కాబట్టి అతని అజ్ఞానం, జ్ఞానం, చేయగలిగింది, చేయలేనిది, అంతా ఆ సమాజానికి చెందినది. అంటేనీ ప్రవర్తననుకూడా mould చేస్తుందన్నమాట.

కాబట్టి మనం యేసమాజాన్నైనా దాని అభివృద్ధిక్రమాన్ని అవగాహన చేసుకొనడం ఏవ్యక్తికావ్యక్తి జీవితానుభవాలద్వారాగాని, అభిప్రాయాలద్వారాగాని సాధ్యమయేపనిగాదు. కేవలం వ్యక్తిగత విశ్వాసాలు, వ్యక్తిగత అనుభవాలు—వాటిమీదనే ఆధారపడి, వాటినే కొలబద్దలుగా తీసుకొని జీవితాన్నిగురించి, సమాజాన్నిగురించి, ఆలోచించే మనిషి తోటి మానవుల నుంచి వేరుపడి ఒంటరివాడవుతాడు. ఫలితంగా తను నమ్మిన సత్యమే తనకు సత్యమవుతుంది. ఇతర మంతా గంగలో కలిసిపోతుంది. తన చుట్టూవున్న సమాజానికి లోబడి తన స్వాతంత్ర్యంకొరకు ప్రయత్నిస్తాడు. తనకు తానుగా వుంటాడు. కానీ సమాజం నుంచీ విముక్తి పొందలేడు. ఒంటరిగా అది జరుగనిపని.

ఇదంతా, సురమౌళిగారి, "నా అనుభవాలు కొన్నింటిని పేర్కొన్నట్లయితే ఈ వ్యాసానికి కావలసిన కొటేషన్సు దొరుకుతాయి" అనే వాక్యాన్ని దృష్టిలో వుంచుకొని చర్చించడం జరిగింది.

విశ్వాసం అనేది వాస్తవానికి రంగారావుగారన్నట్లు మతప్రాతిపదికమీద పుడుతుంది. ఏ విశ్వాసాలున్నా సురమౌళిగారి విశుద్ధమైన నైతిక ప్రవర్తనగురించి

నేను శంకించడంలేదు. అందుకువారు అభినందనీయులు. జీవితంలో ఆయన చేసిన పనులన్నీ సాహసముతో కూడుకున్నవే. సామాన్యులకు అలవిగానివి. ఇవి ఆయన strong intillect ను సూచిస్తాయి. వచ్చిన చిక్కంతా ఆయన ఏ విషయాన్నీ సామాజిక దృష్టితో చూడకపోవడమే. అలాచూస్తేవారిని తప్పకఅందరూ ఆదరిస్తారు. ఆహ్వానిస్తారు-'నేను' 'నాది' అనేదృష్టినుంచి ఆయన విముక్తుడు కానంతవరకు ఆయన మనస్థైర్యం, చిత్తశుద్ధి, ప్రయోజనకరంగావుండవని నా అనుమానం. వ్యక్తి ఆత్మ విశ్వాసం కలిగి వుండాలి—మూఢనమ్మకాలు వుండరాదు—వాటిని సమూలంగా నాశనం చేయాలి—అనే ఆయనకోరిక మంచిదే. అవి వుండాలని ఎవరూ కోరుకోరుకదా: ప్రజల్లో మూఢవిశ్వాసాలుంటే పురోగతికి ప్రతిబంధకమని అందరికీ తెలుసు. దోపిడీని సులభతరంచేయడానికి దోహదాలుఅని అవిఅందరికీ తెలుసు. ప్రజలు విజ్ఞానవంతులు కావలిసిందేనని అందరూ వొప్పుకుంటారు. ఆ ఆశయం కొరకు కృషిచేస్తున్న సురమౌళిగారిని అభినందించకతప్పదు.

చిక్కేమిటంటే మూఢవిశ్వాసాలతో కుస్తీపట్టడం, దేవుడ్ని ఖండించడం, ఆచారాల్ని దుయ్యబట్టడంవల్ల అవిపోవు. విద్య, విజ్ఞానం, ప్రజల సాంస్కృతిక స్థాయి, జీవన స్థితిగతులు, మెరుగవడంద్వారానే అవి అంతమొందుతాయి. వాటి పునాదులు సామాజిక ఆర్థిక సంబంధాల్లో వున్నాయి. ఆ సంబంధాలజోలికి పోకుండా, జీవితాల్లో మార్పులురావు. జీవితాల్లో మార్పులురాకుండా అవిపోవు. "Man believes in Gods etc., because of his confused and chaotic social relation ships, but as soon as society has been organised man will be above social laws and his whole destiny will be subordinate to reason, will be shaped according to reason, (Marx). అంటే జీవితమంతా అయోమయంగావున్నప్పుడు, అంతా chance మీద ఆధారపడి అరాజకంగా వున్నపుడు ఆ నమ్మకాలుంటాయి. అవన్నీ ఒక పొంమిక ఆర్థిక వ్యవస్థకు ఫలితాలన్నమాట. అవిరెండూ విడదీయరానివి. అప్పుయిచ్చేవాడున్నంతవరకూ (అధిక వడ్డీలకైనా సరే) తీసికొనేవాడుంటాడు. తీసికొనేవాడున్నంతవరకూ యిచ్చేవాడుంటాడు. వాటిలో ఒకటి పోయి ఒకటి వుండదు. సమాజమంతే, తీసికొనేవాడూవుండడు. యిచ్చేవాడువుండడు మూఢనమ్మకాల పనగూడా అంతే, వ్యక్తిగతంగా ఎంత తలపగులకొట్టుకున్నా ఆ సమస్య పరిష్కారం కాదు.

మూఢ నమ్మకాలు—వాటినిగురించిన మన విశ్వాసాలు — యివిరెండేగాదు సర్వస్వం—సమగ్రమైన చైతన్యంలో నాస్తికత్వం అనేది ఒక భాగం.

మొత్తం సమాజాన్నంతటినీ, దాని సమస్యల్నీ, అన్నిటినీ పరిగణనలోకి తీసుకొని, దాన్నిమార్చడంలోనే, అందుకు అందరితోకలసి ఐక్యంగా పోరాడడంలోనే మూఢ నమ్మకాల నాశనానికి ప్రయత్నించడం యిమిడివుంది.

ఇకపోతే "నేను ప్రవర్తించినమరే ప్రవర్తనలోగాని హేతువాద దృష్టికి...." అని సురమౌళిగారు రంగారావుగారిని ఏదోకోరినారు.

పై వాక్యాలవల్ల సురమౌళిగారికి self perfection మీద నమ్మకం వున్నట్లుంది. ఇదిగూడా తాత్వికదృష్టి. ఎవరెవరిలోఉండే మూఢనమ్మకాలను వాళ్ళు తుడిపేసుకోండి. జీవితం బాగుంటుంది. అని గద్దెఎక్కి బోధించడం అవుతుంది. శతాబ్దాలుగా, యుగాలుగా ఎవరెంత బోధించినా అవిపోలేదు. ఇప్పుడు సామాజిక శాస్త్రం అభివృద్ధి అయింది. మానవుని స్వార్థపరతను, కశ్మలాన్ని, చెడుగును, తొలగించాలంటే జీవితాల్ని మార్చడం. అందుకుపోరడం విశుద్ధప్రవర్తనకుగీటురాయి. అంతకన్నా మానవతలేదని తేలింది. మానవుడు పరిసరాల మార్చుకొనడంలోనే తనూ మారుతాడు. వాటిని మారుస్తాడు. అభ్యుదయశీల దృక్పథం యిదికాదా?

—ఎస్. గోవిందరెడ్డి.

ఒక ముఖ్యప్రకటన

సృజన మొదటి, రెండవ సంచికలు అమ్మిన వ్యక్తులు, పుస్తక సంస్థలు వారివద్ద పై రెండు సంచికలు ఇంకా మిగిలివుంటే ఈ క్రింది చిరునామాకు వెంటనే పంపవలసినదిగా కోరుచున్నాము.

వరవరరావు

పోస్టు: జడ్చర్ల స్టేషన్

జి॥ మహబూబ్‌నగర్

శ్రీ శ్రీ

ఆధునిక సాహిత్యంలో ఆధ్యాత్మిక చింతన

"దేవుడు చేసిన మనుషుల్లారా, మనుషులు చేసిన దేవుళ్ళారా, మీ పేరేమిటి?" అనే సుదీర్ఘశీర్షిక కింద గురజాడ అప్పారావుగారొక కథ వ్రాశారు. గురజాడను ఇప్పటికీ అనేకులు కన్యాశుల్కం నాటకకర్తగానో, లేక ముత్యాలసరాల వంటి నూతనచ్ఛందప్రక్రియలను సంతరించిన మహాకవిగానో ఎరుగుదురుకాని వారి సర్వతోముఖ ప్రతిభను గుర్తించినవారు చాలా అరుదు. ఇరవయ్యో శతాబ్దం ప్రభవించకముందే ఇరవయ్యో శతాబ్దపు భావస్రవంతిని ఆకళించుకున్నవాడు శ్రీ గురజాడ. వారు కలం పట్టిననాటికి సినిమాలులేవు, విమానాలులేవు, రేడియో టెలివిజన్లు లేనేలేవు. చంద్రగోళానికి ప్రయాణం అంటే స్వప్నలోకంలో విహారమే అనుకునేవాళ్ళే అనేకానేకులు. అణువును ఛేదించడం అసాధ్యం అని ఆనాటి వైజ్ఞానికులుసహా విధిగా విశ్వసించారు. వారికాలంలో దేశభక్తి ఒకనేరం. అది రాజభక్తియుగం. అటువంటి పరిస్థితుల్లో "దేశమును ప్రేమించుమన్నా" అని వ్రాయగలగడమే ఒక సాహసం. ఈ సాహసమే గురజాడకు ప్రపంచంలోని ప్రథమశ్రేణి వివేచనాపరులలో ప్రముఖ స్థానం సంపాదించింది.

ఆధ్యాత్మిక చింతనకు నేనిచ్చే అర్థం ఇదే. అంగీకరించిన దానికి అభ్యంతరం చెప్పడం. పాతపుంతల్లో ప్రయాణం మాని నూతన మార్గాలను అన్వేషించడం. మానవుని ఆలోచనకు అవధుల్లేవు. సాహసించినవాడికి గుహేటకావళీ సాక్షాత్కరిస్తుంది. మానవ జీవితమే ఒక మహా సాహసిక యాత్ర.

మళ్ళీ మొదటికొస్తున్నాను. "మీ పేరేమిటి" అనే కథలో గురజాడ చెప్పదలచిందేమిటి? మనిషిని దేవుడుచేశాడా, దేవుడు మనిషినిచేశాడా అనే సందేహాన్ని తన కథాశీర్షికలోనే నిక్షిప్తంచేశాడు. అంతవరకు అంతమందీ–ఒక్క మనిషినే అన్నమాటేమిటి, ఈ సకల చరాచర ప్రపంచాన్నే ఒక సర్వేశ్వరుడే సృష్టించాడు–అని విశ్వసిస్తూ వచ్చారు. అది నిజంకాదేమో, బహుశా మానవుడే భగవంతుణ్ణి సృష్టించాడేమో అని సందేహాన్ని ప్రవచించాడు గురజాడ. భగవంతునిపేరిట పోరాడుకోవడం మాని మానవుని పేరిట ఐక్యం కావాలన్నదే గురజాడ సందేశం. ఈ మానవతా వాదానికి దేశభక్తి గీతం పరాకాష్ఠ.

అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయ్
మతం వేరై తేను యేమోయ్
మనసులొకటై మనుషులుంటే—

అన్నాడు ఆ గీతంలో. మనిషి అనే ఇంకో గీతంలో....

మనిషి చేసిన రాయి రప్పకి
మహిమ కలదని సాగి మొక్కుతు
మనుషులంటే రాయి రప్పల
కన్న కనిష్టం
గాను చూస్తావేల బేలా,

అంటూ ఒక మనిషి ఇంకో మనిషిని పీడించే విధానాన్ని నిర్ద్వంద్వంగా ఖండించాడు. తెలుగు సాహిత్యానికి సంబంధించినంతవరకు మానవతా వాదానికేకాక సామ్యవాదానికి కూడా ఈ గీతంలోనే బీజావాపన జరిగిందని నా ఉద్దేశం.

మానవత్వాన్ని ఎగసనదోయాలంటే మన ఆలోచనా విధానాలన్నీ మారవలసిన అగత్యం ఉంది. తరతరాలుగా కరడుకట్టిన రకరకాల మూఢవిశ్వాసాలే ఇందుకు ప్రగాఢ ప్రతిబంధకం. వీటిమీద ధ్వజమెత్తి విజయం సాధించినవాడు కందుకూరి వీరేశలింగం. ప్రజలలో పాతుకపోయిన మూఢవిశ్వాసాలను పాదులతో పెకలించిన వాడు వీరేశలింగం. రాజశేఖర చరిత్ర అనే నవలలో వీటన్నిటిని విస్తృతంగా చిత్రించాడు. అనేక ప్రహసనాల్లో వీటన్నిటినీ వేళాకోళం చేశాడు. ముఖ్యంగా జాతకాల్ని గురించిన్నీ, మంచిముహూర్తాలు పెట్టడాన్ని గురించిన్నీ ఈయన తనస్వీయ చరిత్రలో ఏమని వ్రాశాడో చూడండి....

నే నారంభదశలో జ్యోతిశ్శాస్త్రమునందత్యంత విశ్వాసము కలవాడనే యైనను, జన్మ పత్రికలలో దీర్ఘాయుష్మంతులగుదురని చెప్పబడినవారనేకులల్పాయుష్కులగు చుండుటయు, మహాధనాఢ్యులగుదురని చెప్పబడినవారనేకులు దరిద్రులగుచుండుటయు సంతానవంతులగుదురన్న వారనేకులు సంతానహీనులగుచుండుటయు, చిరకాల

సువాసినులగుదురన్న కాంతలు పలువురు చాల వితంతువులగుచుండుటయు, సుముహూర్తములు పెట్టుకొని చేసిన కార్యములు పెక్కులు భగ్నములగుచుండుటయు చూచుచు వచ్చినకొలదిని నాకీ జ్యోతిష విషయములో యంత కంతకు నమ్మకము తగ్గి లోకానుభవమధికమయిన తరువాత పూర్ణముగా నశించెను....జన్మ పత్రములలో వ్రాయబడిన ఫలములలో కొన్ని కాకతాళీయములుగా గలుగుట తటస్థించినను గొన్నియైనను దప్పిపోవుచుండుటచేత నక్షత్రశాస్త్రము విశ్వాసయోగ్యమైనది కాదని నా దృఢ నిశ్చయము.

అదే స్వీయచరిత్రలో ఇంకొకచోట, మంచిరోజు చూసుకొని ప్రయాణం చెయ్యమని చెప్పినవారికి జవాబుగా వీరేశలింగంగారు....దేవుడు చేసిన రోజులలో కొన్నిమంచివనీ కొన్ని చెడ్డవనీ అనడానికి వీలులేదని, అన్నిరోజులూ మంచివేఅని ఉద్ఘాటించి అనుకున్ననాడే ప్రయాణం చేసినట్లుగా వ్రాశారు.

ప్రజలలో మూఢవిశ్వాసాలనూ, మూఢాచారాలనూ రూపుమాపడానికీ, జీవితంలో హేతువాద దృష్టిని పెంపొందించడానికి శ్రీ వీరేశ లింగం సాహిత్యాన్ని ఒక ఆయుధంగా చేపట్టాడు. ఆ ఆయుధంతో–వివేకవర్ధని–అనే పత్రికను నడిపించాడు. తులసీ రుద్రాక్షమాలాది బాహ్యచిహ్నధారణకంటే సత్ప్రవర్తనమే ముఖ్యమని చాటి చెప్పాడు. అప్పటికే బహుదేవతారాధన విడిచి ఏకేశ్వరోపాసనబూనిన శ్రీవీరేశలింగం–వివేకవర్ధని–మొదటి పత్రికలోనే తన పరిశుద్ధాస్తిక భావాన్ని ఇలా ప్రకటించాడు.

అక్ష్యాది బాహ్యేంద్రియాగోచరుండయి
యాత్మ స్వరూపుడై యలరువాడు
సచరాచరంబైన సర్వసృష్టికి నాది
కారణుండయి చాల గ్రాలువాడు
దుష్టశిక్షణమును శిష్టరక్షణమును
నాత్మకృత్యములుగ నమరువాడు
సర్వజ్ఞుడయి యుండి జనులెందుగావించు
సుకృతదుష్కృతముల జూచువాడు

నిత్యుడీశ్వరుడఖవుండు నిర్మలుండు
నాదు ప్రతికారత్నంబు నాదరమున
బ్రబలగా జేసి యెల్లెడ వాసికెక్క
నించుకంత దయననుగ్రహించుగాత.

ఈనాడు సర్వసాధారణంగా జనులందరూ అంగీకరించే స్త్రీ విద్య, వితంతు పునర్వివాహం మొదలైన ఎన్నో సాంఘిక వ్యవస్థలు, వీరేశలింగంగారి కాలంలో జీవన్మరణ సమస్యలుగా ఉండేవి. ఇవి పిదపకాలపు బుద్ధులని, వీటన్నిటికి పాశ్చాత్య వ్యామోహమే కారణమని ఆనాటి అభివృద్ధి నిరోధకులు వాదించేవారు. వాదించడమే కాదు హిందూమతోద్ధారణం తమ భుజస్కంధాలమీదనే ఉన్నట్లుగా భావించి ఒక సందర్భంలో వీరేశలింగంగారిని చంపించడానికికూడా ప్రయత్నించారు. పరాయి దేశాల భావాలు ప్రవేశించి మన దేశాన్ని పాడుచేస్తున్నాయని వాపోయారు. వితంతువు యావజ్జీవితం వితంతువుగా ఉండడమే స్వదేశీవిధానమని భ్రమించారు. అందుకే మహామహోపాధ్యాయ కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు వీరేశలింగాన్ని వేళాకోళం చేస్తున్నానని అనుకుంటూ—వివేకవర్ధని—అనే పేరులోని అక్షరాలను తల క్రిందులుగా చేసి—"నిర్ధవకవేవి"—అని చమత్కరించారు. దీనితో వితంతు వివాహ సమస్య చావుదెబ్బ తిన్నదని చాలామంది సంతోషించారు. కాని, కాలం మాత్రం వేరువిధంగా తీర్పు ఇచ్చింది.

అసలు సంగతి ఏమిటంటే కృతి, ప్రతికృతి సమీకృతిఅనే గతి తార్కిక విధానంలో ప్రపంచం పురోగమిస్తుంది. దీన్నే ఇంగ్లీషులో డయలెక్టిక్ అంటారు. ప్రతికృత్యానికి ప్రతికృత్యం ఉంటూనే ఉంటుంది. ఇవి అనుక్షణం తీవ్రంగా సంఘర్షిస్తూనేఉంటాయి. ఆ సంఘర్షణ ఫలితంగా ఒక్కకొత్త సమీకరణం జరుగుతూ ఉంటుంది. "ఔను" తో "కాదు" సంఘర్షిస్తుంది. తత్ఫలితంగా మరో కొత్త ఔను ఆవిర్భవిస్తుంది. ఇదే గతి తర్కం.

అయితే దీన్ని మొదటిసారిగా ప్రకటించిన హెగెల్ అనే జర్మన్ దార్శనికుడు ఈ విధానానికి మూల కారణం ఆధ్యాత్మికమైనని వివరించాడు. దాన్ని ట్రాన్సెండెంటల్ డయలెక్టిక్ అంటారు. సామ్యవాదానికి మూలపురుషుడైన కార్ల్ మార్క్స్ యీ మూలకారణం ఆధ్యాత్మికం కాదనీ అది భౌతికమనీ వాదించాడు. అదే డయలెక్టిక్ మెటీరియలిజమ్. (Dialecitcal Materialism)

౧౯౩౦–౪౦ సంవత్సరాలనడుమ దశాబ్దంలో ఈ వాదం ఆంధ్ర దేశంలోని ఎందరో యువకులను ఆకర్షించింది. అప్పటికే మార్క్సు సిద్ధాంతాలు సోవియట్ యూనియన్ రూపంగా ఆచరణలో ఆకారం తీసుకున్నాయి. పుట్టిట్లోనే ఆ సామ్యవాద రాజ్యాన్ని సంధి కొట్టించడానికి ఎన్నో అభివృద్ధి నిరోధక శక్తులు ప్రయత్నించాయి. కాని ఆ బిడ్డకు మంత్రసానితనం వహించిన లెనిన్ మహాశయుడు కంటికి రెప్పగా దాన్ని కాపాడాడు. అయినా అడుగడుగునా అతడెన్నో అవాంతరాల నెదుర్కోవలసి వచ్చింది. ఈ బిడ్డకు ఇరవైయేళ్ళు వచ్చేదాకా ఏ యుద్ధాలూ రాకుండావుంటే మరి దీనికి మరణం ఉండదు అని ఉద్ఘాటించాడు.

ప్రపంచంలోని ప్రతిదేశపు సాహిత్యంమీద సామ్యవాదంతన ప్రభావాన్ని ప్రసరించింది. తత్ఫలితమే ౧౯౪౦లో ఆంధ్రదేశంలో అభ్యుదయ రచయితల సంఘం ఆవిర్భావం. వీరిని ప్రేరేపించిన చోదకశక్తులు గురజాడ, వీరేశలింగం మొదలగువారి రచనలే. వీరిద్దరూ కూడా ఎక్కడా దేవుడులేడని చెప్పలేదు. ఈలోగా చోపరాజు రామచంద్రరావు గారు నాస్తికవాదాన్ని చేపట్టి—దేవుడున్నాడని చెబుతూ మోసపు బ్రదుకు బ్రతకడం కంటే, దేవుడు లేడని ఒప్పుకుంటూ నిజాయితీగా బ్రతకడమే మంచిదని చాటి చెప్పాడు. త్రిపురనేని రామస్వామి చౌదరిగారు వేదాల అధికారాన్ని సవాలు చేశారు. ఉన్నవ లక్ష్మీనారాయణగారు తమ నవలలో ఒక మాలదాసరిని నాయకుడుగాచేసి జైలుకుకూడా వెళ్ళారు. నిన్న మొన్నటిదాకా ఆ నవలమీద ఆంక్ష తొలగించబడ లేదంటే, స్వరాజ్యం వచ్చిన తర్వాతకూడా మనమెంత గతానుగతికంగా పోతున్నామో మొదట్లోనేను ప్రస్తుతించిన సాహసం ఎంతవరకు కొరవడిపోయిందో స్పష్టమవుతుంది.

దేవుడున్నాడని అనేస్తే చాలదు. దేవుడు మెచ్చుకొనే విధంగా మనజీవితాలను తీర్చి దిద్దుకోవాలన్నాడు కందుకూరి వీరేశలింగం. మంచి అన్నది మాలయైతే మాలనే అగుదున్ అన్నాడు గురజాడ. పూని యేదైనాను ఒక మేల్ జేసి జనులకు చూపవోయ్ అన్నాడు మహాకవి. దేవుడుకూడా అప్పుడప్పుడు తన తడాఖా చూపించడానికి భూలోకానికి వస్తూంటాడనీ మన పురాణాలు ఘోషిస్తున్నాయి.

కారణాల మాటకేంగాని ఒకానొక కుహనాభక్తి ఆంధ్రదేశమంతటా వ్యాపించి నట్లు కనబడుతుంది. అంతా ఆ సర్వేశ్వరుని దయ. మనంచేసేదేముంది గనక ...

అనే ఆత్మవిశ్వాసహంతకమైన ఒక మనస్తత్వం ప్రస్ఫుటంగా గోచరిస్తోంది. అందుకే ఒక యువకవి ఇలా అన్నాడు.

తెనుగునాట భక్తిరసం
తెప్పలుగా పారుతోంది
డ్రెయినేజీ స్కీము లేక
డేంజరుగా మారుతోంది.

నా మట్టుకు నాకు దేవుడున్నాడా లేడా అన్న సందేహం తీరలేదు. అందుకే నేను రాస్తున్న సదసత్సంశయంలో—ఇలా ప్రశ్నించాను.

ఈ సృష్టికి ఏమర్థం?
మానవునికి గమ్యమేది?
ఒక సకలాతీత శక్తి
ఉన్నట్టా? లేనట్టా?

(ఆకాశవాణి సౌజన్యంతో)

ప్రయోగశీలత్వం.

అనుభవంవల్ల మారి, ఎదిగే చాలా మంది కవుల రచనలకు ప్రయోగశీలత్వమనే పదాన్ని చక్కగా అన్వయించవచ్చును. అదే ప్రపంచంలో జీవిస్తున్నా ఏళ్ళు గడచినాకొద్దీ ఇదివరకటి ప్రపంచమూ, తనూ, ఇప్పటి ప్రపంచమూ తనూ వేరయినట్లు—కవి కొత్త వస్తువుకోసం వెతుక్కోవచ్చు, లేదా అదే విషయాన్ని వేరువిధంగా చూడవచ్చు. ఈ మార్పులన్నీ లయ, కవిసమయము, ఆకృతీ—ఈ అన్నిటియందు మార్పులద్వారా వ్యక్తం కావచ్చును. అయితే నిజమయిన ప్రయోగశీలి అశ్రాంతమయిన కుతూహలం వల్లనో, కొత్తదనం మీద ఆకాంక్ష వల్లనో, ఆశ్చర్యపరచాలనే, సంభ్రమ పరచాలనే కోరికవల్లనో ఈ పనిచేయడు. అతని ప్రతికొత్త కవితలోనూ, తొలిదానిలోవలెనే, వస్తున్న, భావాలలోని వికాసానికి (కవిగా ఆయనకు దాన్ని ఆపగలిగే శక్తి లేదు) సరియైన రూపాన్ని వెతుక్కోవాల్సిన అవసరం అతన్ని ప్రయోగశీలత్వానికి ప్రోద్బలిస్తుంది.

—టి. యస్. ఇలియట్.

కుందుర్తి:

"మహాప్రస్థాన" కావ్య మీమాంస.

(ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాలశాఖ ఆధ్వర్యాన జరిగిన "పాఠకుల చర్చాసదస్సు"లో చేసిన ప్రారంభోపన్యాసం—28-2-1967)

ఈ వ్యాసం 'మహాప్రస్థాన' కావ్యం మీద విమర్శ కాదు. నేటి సమావేశంలో ఆ కావ్యాన్ని గురించిన మంచిచెడుల చర్చజరుగుతున్నది కాబట్టి చర్చనీయాంశాలు కొన్ని నాకు తోచినవి మనవి చేస్తాను.

చెలమే నయం:— ఈ కావ్యాన్నిగురించి దీన్ని కావ్యం అనిఅనడానికి వీల్లేకపోతే, యీ ఖండికాసంపుటిని గురించి 'యోగ్యతాపత్రం'లో చెలం చెప్పినదానికంటె అధికంగా చెప్పటం చాలకష్టం. సంఘానికి ఎదురు తిరిగిన ఆధునిక రచయితల్లో చెలం ప్రథమ గణ్యుడు. శ్రీశ్రీ కవిత్వం చదివితే 'నమ్మిన కాళ్ళక్రింద భూమి తొలుచుకు పోతుంటే, ఆచెలమేనయం అని వెనక్కి పరుగెత్తి చూస్తారు.' (పాఠకులు) అన్నాడు చెలం. అంటే పాత విశ్వాసాల పునాదులు పెకలించి వేయడంలో తనకంటే శ్రీశ్రీ అధికుడని చెలం యిచ్చిన సర్టిఫికెటు. "నన్ను నయమనిపించరా నాయనా" అని తెనుగులో ఒక సామెతవుంది. చెలమే నయమనిపించాడు శ్రీశ్రీ. ఎందుకంటే చెలం చెప్పినదంతా కేవలం సాంఘికభావ విప్లవ పరిధిలోపలే వున్నది. దానివల్ల ప్రస్తుత సాంఘిక వ్యవస్థకు తక్షణం ప్రమాదంలేదు. శ్రీశ్రీ దానికి రాజకీయాలు జోడించాడు ఇది మరీప్రమాదం కదూ.

చెట్లు కూలిన దృశ్యం:— తెనుగు సాహిత్య చరిత్రలో యిటీవలి కాలంలో వీచిన ఒక జంఝామారుతవీచిక శ్రీశ్రీ. ఆ పెనుగాలికి తొడలు విరిగి పడిన దుర్యోధనునివలె ఫెళ్ళుమని విరిగి పడిపోయిన భూరుహములు అసంఖ్యాకంగా వున్నాయి. ఆనాటికి ప్రసిద్ధిచెందిన ఆధునిక కవిరాజ రాజులు అందరూ దాదాపు విరిగి పడ్డారు. ఎటుచేరీ అప్పటికి గడ్డి మొక్కలైనా మాత్రమేనున్న యువకులు మాత్రం విరిగి పడలేదు. కాని ఆజంఝామారుత స్పర్శ గడిమొక్కలన్నింటికీ సోకింది. అదొక అగ్నిపర్వతపు

విజృంభణ. ఆ లావావేడి అన్ని సాహిత్య శాఖలకు సోకింది. నిజమైన అర్థంలో– అంటే కావ్యవస్తువులో రూపంలో కొత్తసృష్టి జరిగింది.

ఆరంభకుడు శిష్లా:– కవితారూపంలో కొత్త కోసం తాపత్రయపడి ఓం ప్రథమంగా కొన్ని ప్రయోగాలుచేసి చూసినవాడు శిష్లా. ఈవిషయం శ్రీశ్రీయే చాలాసందర్భాలలో అంగీకరించాడు. అయితే యీయుగకర్తృత్వం శిష్లాకురాక శ్రీశ్రీకి రావడానికి కారణం కావ్యవస్తువులో శ్రీశ్రీతెచ్చిన విప్లవమే. ఆయన చెప్పిన కొత్త సిద్ధాంతాలు, చూపిన కొత్త ఆదర్శలోకాలు భావించిన అభ్యుదయ పథాలు ప్రజలను బాగాఆకర్షించినవి. ఏ కవితారూపంలో చెప్తున్నాడు అనేస్పృహ మనకు లేకుండాచేసి శ్రీశ్రీ తననూతన కావ్యవస్తుమార్గాన్ని సరిదిద్దాడు. గురజాడ ఆరంభించిన యీ మార్గము, ఆయన తరువాతవచ్చిన కవులు అనతి కాలంలోనే మరచిపోయి, ప్రకృతి, ప్రేయసుల వ్యవహారాలతో కావ్యాలను నింపుతూన్న రోజుల్లో శ్రీశ్రీ చూపిన మార్గము కొట్టవచ్చినట్లు కనిపించి నిజంగా యిదికొత్తది అనే అభిప్రాయం కల్పించినందువల్ల పాఠకులందరూ ఆ నూతనయుగ ప్రవర్తవైపు ఆకర్షితులు కాకతప్పలేదు. కవిత్వములో రూపమునకూ వస్తువునకూ దాదాపు సమాన ప్రాధాన్యమేవున్నప్పటికీ, పోల్చిచూసినప్పుడు రెండవదాని బలమే కొంచెమెక్కువనీ, వస్తువననుసరించు రూపము తనంతతాను అవసరమైన మార్పులకు లోనవుతుందనీ శ్రీశ్రీ రుజువుచేసాడు. అయితేఆయన శబ్దబ్రహ్మకాబట్టి, తెనుగు శబ్దములమీద ప్రభుత్వం నెరపగలిగి, వాటిచేత తనయిష్టంవచ్చిన సేవచేయించుకోగల ప్రతిభావంతుడుకాబట్టి దాదాపుపోతనవంటి శాబ్దికమైన ఇంద్రజాలికుడు కాబట్టి నెట్టుకవచ్చాడు. తరువాత ఆయన నాయకత్వాన ప్రవర్తిల్లిన అభ్యుదయ కవితాయుగంలో యిది కొరవడింది. వారికి అటు కావ్యభాషమీదగానీ యిటు వ్యవహారిక భాషమీదగానీ అధికారంలేదు. అందువల్ల ఆయుగం కవులందరూ ఆయన చెప్పినదే చెప్పారుగాని ఆయన చెప్పినంత కవిత్వంగా చెప్పలేకపోయారు. అందువల్లనే ఆ యుగం అంత త్వరగా అంతరించి పోయింది. మరొక కారణం. ఆయన చెప్పినదే చెప్పారన్నానుగదూ. అవును; ధర్మము ఎవరు చెప్పినా ఒకటే. కాని అంతవరకు ప్రేమ కవుల ధర్మమాఅని ప్రారంభమైన ఆత్మాశ్రయ పద్ధతిలోనేచెప్పడం ఒకలోటు. దీనివల్ల చెప్పినదే చెప్తున్నారు అనిపించింది. వస్త్వాశ్రయమార్గమునకు అభ్యుదయ

కవిత మరలినట్లయితే అలా అనిపించేదికాదు. ఆ యుగం మరికొంత కాలంరాజ్యం చేసివుండేది.

తెగని ఛందో బంధాలు:— కవితారూపమును ఆరంభంలో మార్చినది శిష్లాఅని మనవి చేశాను. ఆయన క్రీవర్సులో విష్ణుధనువు; నవమి చిలుకవంటి కావ్యాలు ప్రచురించాడు. శ్రీశ్రీ ఛందో బందోబస్తులన్ని ఛట్ ఫట్ మని త్రెంచివేయమని నినాదమిచ్చాడు. కాని ఆయన మాత్రం త్రెంచలేకపోయాడు. ఈనాటికి శ్రీశ్రీని కవిగాగుర్తించి మెచ్చుకునే వారందరూ, మహాప్రస్థానంలోని ఒక అరడజను ఖండికలవల్ల వ్యామోహితులైనవారే. మహాప్రస్థానం, జగన్నాథరథచక్రాలు, దేశచరిత్రలు, అద్వైతం, ప్రతిజ్ఞ మొదలయిన ఖండికలు వారిని ఆకర్షించినవి. "వ్యత్యాసం" 'ఆకాశ దీపం' మొదలయిన వచన కవితా ఖండికలవల్ల శ్రీశ్రీకి పేరు రాలేదు. కారణం నాటికీ నేటికీ ప్రజలు ఛందస్సుకూ, చెవులకూ ప్రాధాన్యంయిస్తారు. యిది శతాబ్దాలుగా వచ్చిన అలవాటు. ఒకనాటితోపోదు. వచన గేయోద్యమం దేశమంతా వ్యాపించిన ప్రస్తుత పరిస్థితుల్లో ఆ అలవాటు క్రమేణా కొంచెం కొంచెంగా సడలుతున్న ఛాయలు కనిపిస్తున్నాయి.

సహజ పరిణామం:— శ్రీశ్రీ పద్యాలు రాసి, మాత్రాఛందో మార్గాలలో ప్రయాణం చేసి, వచన కవిత్వం వైపుకువచ్చినవాడు. తెనుగు కవిత్వంలో యిటీవల వచ్చిన సహజ పరిణామమేయిది. ఈ వచన కవిత్వమనేది కేవలం పాశ్చాత్య అనుకరణవల్ల మాత్రమే తెనుగు కవిత్వంలో దిగుమతి అయిందంటే నేను పూర్తిగా అంగీకరించను. గురజాడ వ్రాసినకొన్ని మాత్రాఛందాలలోకూడా మధ్యమధ్య మాత్రలు విరిగి వచన గేయం వైపుకు మ్రొగ్గిన ఉదాహరణలు వున్నాయి. క్రొత్తదనుకున్న కావ్య వస్తువును గురించి చెప్పడానికి సంప్రదాయ ఛందస్సుల చాలని తనం గురజాడ నుండి అధునికు లందరూ అనుభవించినవారే. అందుకే కొత్త ఛందస్సులకోసం అన్వేషణజరిగింది. సహజ పరిణామంగా యిప్పటి వచనగేయం అవిర్భవించింది. శ్రీశ్రీకి పాశ్చాత్య భాషా కవిత్వాలతోగల పరిచయం కొంతవరకు యీ సహజ పరిణామానికి దోహదం చేసి వుండవచ్చు.

మహాప్రస్థానం మాత్రోఛందో కావ్యమే :— శ్రీ శ్రీ యింకా మాత్రాఛందస్సుల

ప్రభావంలో వున్నప్పుడే—ఒక విషమైన సంధికాలంలో మహా ప్రస్థానం వచ్చింది. దీనిని నేను దాదాపు నూటికి తొంభై పాళ్ళ మాత్రాఛందో కావ్యంగానే పరిగణిస్తాను. ఎందుకంటే చలం యిలా అన్నాడు "తను చెప్పదలచుకున్నసంగతి తనకే స్పష్టంగా తెలీనప్పుడు తన చేతకానితవాన్ని అర్థ అస్పష్టతనీ ఛందస్సు చీరల వెనుకా, అలంకారాలమధ్యా, కఠిన పదాల బురఖాలలోనూ దాచి మోసగించాలని చూస్తాడుకవి. ముఖ్యంసహజ సౌందర్యం తక్కువైనప్పుడు. సులభంగా సూటిగా చెప్పేసి యింత ధ్యానానికీ మౌనానికీ, కార్యాలకీ విజయాలకీవ్యవధి నివ్వరాదా అని చెలంకోర్కె." ఇది నిజమే నేనొప్పుకుంటాను, మా 'శ్రీపాద' వారు మరీ ఒప్పుకుంటారు. కాని విచిత్ర మేమంటే చెప్పదలచుకున్నదివుంటే అర్థస్పష్టతవుంటేకూడా శ్రీశ్రీ ఛందస్సుల చీరల వెనుకా, అలంకారాల రవికలమధ్య దాక్కున్నాడు.

ఒక ఉదాహరణ మనవి చేస్తాను "కవితా, ఓకవితా" అనేఖండిక శ్రీశ్రీ వ్రాసిన వచనగేయఖండికలకు ఉదాహరణగానూ, ఛందస్సులేకుండా లయ సాధనకు శిఖర స్థాయి ప్రయత్నంగానూ అనేక మందిచే పేర్కొనబడింది. చెలం దృష్టిలోనూ వీరి దృష్టిలోనూ ఛందస్సుఅంటే పద్యాలని అర్థమేమోకాని మాత్రాఛందస్సులను ఆ అర్థ పరిధిలోనికితెచ్చుకుంటే 'కవితా ఓ కవితా' ఖండిక ప్రథమార్ధభాగమంతా ఛందస్సే. చదువుతాను వినండి, మాత్రలను లెక్కపెట్టుకుంటూ.

కవితా ఓ, కవితానా. యువకాశల నవపేశల
సుమగీతా, వరణంలో, నినునేనొక, సుముహూర్తం
లో అతిసుం, దరసుస్వ్యం, దనమందున, దూరంగా
వినువీధు, ల్లో విహరిం, చే అందని, అందానివి
గాథావిం, చినరోజుల, లోపీకై, బ్రతుకేఒక,
తపమైపెను, కాదేనిను, షాలందుని, షాలందున
ఎటునేజూ, చినచటులా, హంకారపు, మటుమాయల
నటనలలో. నీ రూపం, కనరానమ, దునవాగుహ
లో కుటిలో, చీకటిలో, ఒక్కడనై, స్రుక్కినరో జులులేవా?

ఇంతవరకు ఒకచరణం-ఎక్కడా ఆరు మాత్రల వరుస విరుగలేదు. మళ్ళీ 8 మాత్రల వరుస ప్రారంభమైంది చూడండి.

స్వర్గద్వారపు, తోరణమ్మైవ్రే, లినవామస్తి, ష్కంలోయేయే
ఘోషలు భాషలు, దృశ్యాల్తోటా, యోనేనేయే, చిత్ర విచిత్ర
శ్యమంతరోచి, ర్నివహం, నోనాగీతం, ఏయేలశక్తుచూశా
లో ప్రాణస్పం, దనపొందిందో.

ఈ విధంగా చాలా దూరం యీ రచన ఛందో బద్ధంగా సాగింది. అయితే యిక్కడ వచ్చిన చిక్కేమంటే. ఛందస్సును నిజంగా తొలగించాలి, వచనకవిత వచన కవితగానే వుండాలి అనే పట్టుదల గలవాబోటి ఒకరిద్దరు తప్ప మిగిలినవారికి యిదంతగా పట్టింపులేదు. శ్రీశ్రీ చెప్పేనమాట, చెప్పే పద్ధతిలో వుండే బలంవారిని తన్మయులుగా చేస్తుంది.

కథా మాతృకలు:— మహాప్రస్థానకావ్య సంపుటిలో 'భిక్షువర్షీయసి' 'బాటసారి' 'ఆకాశదీపం' కథా మాతృకగల ఖండికలు. ఈ మూడింటిలో కరుణరసం తొణికిస లాడుతుంటుంది. సర్వప్రపంచ దేశాలలోని అధో జగత్సహోదరుల కన్నీటిగాథలు, బాధలుచూసి "పతితులార, భ్రష్టులార, బాధాసర్ప దష్టులార ఏడువ కండేడువకండి" అని ఓదార్చిన జగన్నాధ రథచక్రాలలో కంటే అధికంగా కరుణరసావిర్భావతి యీ ఖండికల్లో కనిపిస్తుంది. కథాకావ్యప్రియులైన అస్మదాదులకు యీ ఖండికలు గ్రంథ మంతటికీ మకుటాయ మానంగా కనిపించటం సహజం.

శ్రీశ్రీది భారత మార్గము:— గురజాడవలె శ్రీశ్రీదికూడా సహజ సౌందర్యభూషితమైన కవితా మార్గము. సూటిగా చెప్పటలోనూ, హృదయస్పర్శిగా పలుకుటలోనూ ఆయన కాయనయేసాటి. సూటిగాచెప్పడం, సాంఘిక ప్రయోజనంకలిగి వుండటం ఆయన కవితకు ప్రత్యేకలక్షణాలు. ఇది మహాప్రస్థాన గ్రంథమంతటిలోనూ కనిపిస్తుంది. నా కనిపిస్తుంది శ్రీశ్రీది ఆధునిక యుగంలో భారత మార్గమనీ, అభ్యుదయ కవిత్వం తర్వాత ఆత్మాశ్రయ మార్గబద్ధమై మార్మికఛాయలను సంతరించుకొని, శ్రీశ్రీయే ప్రారంభించిన సక్రియ లిష్టువిధానాలను జీర్ణించుకుని యిటీవలి దిగంబర కవితవరకు ప్రవర్తిల్లినయుగము ప్రబంధమార్గమనీ. బాగా సూటిగా చెప్పగలగడంవల్ల శ్రీశ్రీకి శుద్ధ వాచ్యకవి అనేపేరుకూడా వచ్చింది. కాని లోతుగాచూస్తే ఆయన ప్రతిపంక్తిలోనూ వ్యంగ్యము పుష్కలంగావుంటుంది. బాటసారి, ఆకాశదీపం, వ్యత్యాసం, భిక్షువర్షీయసి వంటి ఖండికలలో ఆయన చూపిన ప్రతిభే దీనికే నిదర్శనం.

<u>వ్యవహారికభాష:</u>— గురజాడ నుండి వ్యవహారికభాష కవిత్వంలోకి తొంగిచూస్తూనే వుంది. ప్రవేశించడానికి బిడియపడుతూనైనా ప్రయత్నంచేస్తూనేవుంది. కాని గురజాడ శ్రీశ్రీలు యింకా మాత్రాఛందస్సులనే అంటిపెట్టుకుని వున్నందువల్ల సంపూర్ణంగా వ్యవహారికభాషనూ వారుస్వీకరించలేకపోయారు. రెండు పడవలలో రెండుకాళ్ళుపెట్టి ప్రయాణం చేయవలసివచ్చింది. శ్రీశ్రీచేసినకొన్ని ప్రయోగాలు చూపుతాను.

<u>గ్రాంథిక ప్రయోగవాసన:</u>— బహుళ పంచమి జ్యోత్స్న భయపెట్టు నన్ను. "భయపెట్టునన్న" అనే ప్రయోగం, "భయపెట్టున్నను"అనే మత్తేభపు ఎత్తుగడకంటె ఏవిధంగా మెరుగు? "ఆకాశపు ఎడారినంతటా అకట"—ఎందుకోయీ"అకట"? "ఎచ్చటెచ్చటకో ఎగురుతు పోయే" "ఎగురుతు" అని హ్రస్వము ఛందస్సుకోసమే కదా. "ఇనబింబం పయనించు నింగిపై." "గాలులువీచును పూవులు పూచును." "మీ హాసంలో మెరుగులు తీరును." మొదలైన ప్రయోగాలన్నీ యీ ఛందో గ్రాంథిక జాతికి చెందినవే. మళ్ళీ "వ్యత్యాసం" అనే ఖండికలో చూడండి యిటువంటి ప్రయోగాలు ఒకమకైనా దొరకవు. ఎందుకంటే అది నికార్సయిన వచనగేయఖండిక. ఈ గ్రాంథిక ప్రయోగ వాసన శ్రీశ్రీలోనే కాదు, ఆయన తర్వాత వచ్చిన అనేక మంది కొమ్ములు తిరిగిన అభ్యుదయ కవులు, ఆధునిక కవుల్లో కూడావుంది. పూర్తిగా వచనగేయం రాస్తూనే తిలక్ ఎన్నోసార్లు యీ తప్పటడుగు వేశాడు. హఠాత్తుగా మధ్యలో "వాసవసజ్జితంబు వలదు" అంటాడు. ఛందస్సుకోసం కాకపోయినా, పాత పద్యాలవాసన, సంస్కృతపదాలమోజువల్లకూడా యిటువంటి ప్రయోగాలు దొర్లుతుంటాయి. వచనగేయానికీ వ్యవహారిక భాషకూగల చారిత్రక సంబంధాన్ని సరిగా గుర్తించక పోవడంవల్లనే చాలా మంది యీ ప్రమాదానికి లోనైనారని నా ఊహ.

<u>కావ్యభాష ఏమయ్యేట్లు?:</u>— ఒకసారి ఒక ప్రముఖ పత్రికా సంపాదకుడు ఆధునిక కవిత్వంపై విసుర్లు విసురుతూ విసురుతూ మధ్యలో ఒక ప్రశ్నవేశాడు "ఈ నాటి వచన గేయం రాయడానికి సుమారు ఒక వెయ్యి తెలుగుమాటలు వస్తేచాలు, పాండిత్య మక్కరలేదు. మరి అందరు కవులు యీ మార్గమే అనుసరిస్తే యిన్ని శతాబ్దాలుగా పర్యాయ పదాలతో, యింతగా అభివృద్ధిచెందిన భాషలోని శబ్దజాలమంతా ఏమయ్యేట్టు. అదంతా అనవసరమని వదిలివేయవలసిందేనా?" అని. ఆధునిక కవులకు పూర్వ కావ్యాలతో పరిచయం పనికిరాదని నేననను. పైగా అది లేనందువల్లనే యిటీవలి

యువకవులు రాసేరాతలు పునాదిలేని భవనంవలె ప్రజలకు దూరమై గాలిలో తేలాడుతున్నవని కూడానేననుకుంటాను. కాని ఒక విషయం మాత్రం స్పష్టంగా గుర్తించడం అవసరం. కవిత్వం దృష్ట్యాచూస్తే సంస్కృత పదభూయిష్ఠంగా కృత్రిమంగా పెరిగిన కావ్యభాష అంతా మానవ శరీరంలో బోగెకాలువంటిది. జీవద్భాషకు దూరదూరంగా జరుగుతూ అదిచిలవలు పలుపలుగా పెరిగింది. దాని నంతనూ ఆధునిక కవిత్వంలో తప్పనిసరిగా వాడుకచేయాలనే నియమం లేదు. నిజానికి భాషా పలుకుబడి పెరిగినదీ, పెరుగుతున్నదీ పెరిగేదీ ప్రజల వ్యవహారంలోగాని కావ్యాలలోకాదు. జీవద్భాషలో వచ్చేపెరుగుదలను గుర్తించి దీనిని కావ్యస్థం చేయడం నేటి కర్తవ్యంకాని పాత కావ్యాలభాషా సంపదనంతా ఆధునిక కావ్యాలలోకి ఎక్కించడం కాదు. శబ్దాలపై తనకుగల మోజుచేత శ్రీశ్రీకూడా యీ విషయాన్ని గుర్తించలేదు. లేక మాత్రా ఛందస్సులు అయిన్నీ ఆపైపులాక్కుపోయాయన్నా నేనొప్పుకుంటాను. చూడండి "కరికరిభిత్ గిరిగిరి భిత్" అనేరచనకు "కవితా ఓకవితా"లోని "ఆ చెలరేగిన కలగా పులగపు విలయావర్తపు బలవత్ ఝరవత్ పరివర్తనలో" వంటి వాటికి తేడా ఏమిటి. ఇది కలగాపులగపు వచన కవిత్వం. "వ్యత్యాసం" అనే ఖండిక చూడండి. "అదృష్టవంతులు మీరు, వెలుగును ప్రేమిస్తారు, ఇరులను ద్వేషిస్తారు, మంచికీ చెడుకూ మధ్య కంచుగోడలున్నాయి మీకు." అన్నట్లు నడుస్తుంది. నిజమైన వచన గేయఖండిక రాయదలచినప్పటి శైలికీ, ఛందస్సుతో సంబంధం పెట్టుకున్నప్పటి శైలికీ ఎంతో తేడా వుంటున్నదన్నమాట. ఈ కారణం వల్లనే దమడమాల ఖండివంటి "కవితా ఓకవితా" అనేది అందరూ అనుకుంటున్నట్లు నిజమైన వచన గేయ ఖండిక కాదంటున్నాను నేను. సహజ సౌందర్య విలసితమైన భావము సూటిగానే బైటికి వస్తుంది. జీవద్భాషకు దగ్గరగానే నడుస్తుంది. దానికి కావ్యభాషతో పనిలేదు. కావ్యభాషను విసర్జించినందువల్ల దాని కవితా లక్షణానికి ఏమీకొరత జరగదు. "మహాప్రస్థానం" తర్వాత శ్రీశ్రీ రాసిన అనేక వచన ఖండికలను పరిశీలిస్తే యీ విషయం స్పష్టంగా తెలుస్తుంది.

శ్రీశ్రీ చాటువులు:—కాళిదాసు, శ్రీనాధుడు, తెనాలి రామలింగకవి మొదలగు పూర్వులు ఎన్నోచాటువులు రాశారు. మంచికవి ఏదో ఒక లైటర్ మూడ్‌లో వున్నప్పుడు చమత్కారం కోసం ఏదో చెప్తాడు. అదివిని ఆనందిస్తాం. శ్రీశ్రీకూడా యీ చాటు కవిత్వం వంటిది చాలారాశాడు, ప్రతిభావంతమైన కవిత్వంతోబాటు. అయితే ఆయన

తర్వాత వచ్చినవారు ఆయనవల్ల ప్రభావితులైనవారు కావడంచేత ఆయన రాసిన చాటుకవితారచనలన్నీ గొప్పకవిత్వంగానే భావించుకున్నారు. మంచి కవిత రాయించిన ఆయన ప్రతిభ తమకు లేనందున, ఆయన రెండవవైపున వీరు అనుకరించడం మొదలుపెట్టారు. ఫలితం, యీనాడు ఆధునిక కవిత్వంలో చమత్కారం దశమరసంగా భాసిస్తున్నది. దీనికి ఆయనదేమీ తప్పులేదనుకోండి. అయినా యీ దృష్ట్యాచూస్తే శ్రీశ్రీవల్ల ఎంతమేలు కలిగినా, కొంత కీడుకూడా కలిగిందేమోననే అనుమానం నాకు అప్పుడప్పుడూ కలుగుతుంటుంది. చిన్నప్పుడు మేం కవిత్వంరాసే తొలిరోజుల్లో "మహాప్రస్థానం" మా దగ్గిర వ్రాతప్రతి రూపంలో వుండేది. అప్పటికది అచ్చు పడలేదు. ఇందులోకొన్ని ఖండికలను సమర్థించి చెప్పడంలో మా దుంపతెగేది. ఉదాహరణకు చూడండి.

"పోనీ, పోనీ, పోతేపోనీ, సతుల్ సుతుల్ హితుల్ పోనీ, పోతేపోనీ .
రానీరానీ వస్తేరానీ కష్టాల్ నష్టాల్, కోపాల్ తాపాల్ శాపాల్ రానీ.
వస్తేరానీ తిట్లూ, రాట్లూ, పాట్లూరానీ, రానే, రానీ.

మాకేమో మా వ్రాతప్రతి అందరికి చదివి వినిపించాలనే ఉబలాటం. విన్న వాడు యిదేమి కవిత్వం స్వామీ అంటే చెప్పలేక చచ్చేవాళ్ళం. మరీ వీల్లేని చోట్ల, "మీరంతా పాతచింతకాయ పచ్చడి ముద్దలని" దబాయించి పంపేవాళ్ళం.

మహాప్రస్థానంలో మరొక విశేషం. ఏసందర్భానికి సంబంధించి అయినా ఒక కొటేషన్ కావలిస్తే అందులో దొరుకుతుంది. "నేను సైతం ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను." "నదీనదాలు అడవులు కొండలు ఎడారులా మన కడ్డంకి." "కదిలేదీ కదిలించేదీ ... పెనునిద్దుర వదిలించేదీ ... కావాలోయ్ నవకవనానికి." "కుక్కపిల్లా అగ్గిపుల్లా సబ్బుబిళ్ళా" "తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?" "అలజడి మాజీవితం ఆందోళన మాఊపిరి" వంటి ప్రయోగాలు కొల్లలు. అసలు శ్రీశ్రీ ఏదిరాసినా ప్రవక్త చెప్పినట్లుండటం చేత, అందులో ఎంతో శక్తి దాక్కొని వుండటంచేత తత్ప్రభావితులం కాకుండా వుండలేని పరిస్థితి మనకు ఏర్పడుతుంది. "వ్యక్తికి బహువచనం శక్తి" అన్నాడనుకోండి దానికి వ్యాఖ్యానంచేస్తూ ఒక వ్యాసమే రాయవచ్చు. అందుకని శ్రీశ్రీని కోట్ చెయ్యకుండా ఏమైనా వ్రాయడం చాలాకష్టం.

ప్రజాదృక్పథం:— శ్రీశ్రీ మాత్రాఛందస్సులు రాశాడా వచన గేయాలు రాశాడా అనే విషయం వదిలివేస్తే ఆధునిక కవిత్వానికి ఒక సంపూర్ణమైన "ప్రజాదృక్పథం" కల్పించినవాడు ఆయనే. ఆయన కవిత ప్రజలందరికీ అర్థమవుతుందా అనే ప్రశ్న వేస్తుంటారు. ప్రజలందరికీ ఏ కవిత్వం అర్థంకాదు కాని, శ్రీశ్రీ కవిత చదివి వినిపిస్తే ప్రజలుతప్పకుండా ఉత్తేజితులవుతారు. ఒక క్రొత్తలోకపు విచిత్రకాంతుల్లోకి తమంతతాము నడచిపోతారు. ఆ"మరోప్రపంచాన్ని" హృదయస్పర్శిగా అనుభవిస్తూ యీ లోకాన్ని కాసేపు మరచిపోతారు. అదేపరనిర్వృతి. కావ్యంయొక్క పరమ ప్రయోజనం. అందుకే శ్రీశ్రీ గొప్ప ఆయన కవిత్వం గొప్ప, ఆయన నాయకత్వం వహించిన కవితాయుగం గొప్ప. నేను గొప్ప, నువ్వు గొప్ప. ఈ యుగంలో వుంటున్న మనందరంగొప్ప.

శ్రీ శ్రీ అనేపేరిట నడిచే అగ్నిపర్వతం, పలికే తుపానుగాడ్పు, ఘంటా కంఠంతో గర్జానాదంతో ప్రవేశించి, పద్యమనే ప్రకృతి మెడపంచి గద్యం పురుషుడి చేత తాళికట్టించాడు. అంతఃపురం ఘంటాపథమైపోయింది. పొన్నుకర్ర విరిగి పోగా ఆ ముక్కలు పైకార్డులకు పూతమిచ్చాయి. శృంగార సాగరంలో అంగార వీచికేచింది. పాతాళానికి మూగతనం వదిలింది. రాజులూ రమణులేగాక, రైతులూ బైతులూ పొలాలూ దేవాలయాలుకూడా కనిపించడం తగ్గి, పొగగొట్టాలూ పోరాటాలూ గుడిసేటి కొంపలూ, హక్కుల గడబిడలూ, నవీన కావ్యరంగ స్థలానికి భిత్తి అయ్యాయి. జీవితంలో రా మొదలైన పెనుమార్పుకదతాకిడి కవిత్వానికితగిలి కవి గుండె రగిలేసరికి కొన్ని దశాబ్దాల జాగైంది.

— కె. వి. రమణారెడ్డి

సమీక్ష:

కాళోజి "నాగొడవ": 'ప్రజాకీయ'కవిత

ఆర్. ఎస్. సుదర్శనం

కాళోజి ప్రజాకవి. రాజకీయకవి. 'ప్రజాకీయ' కవి.
'ప్రజాకీయ' అనేపదం కాళోజి సృష్టించిందే।
"ప్రజాకీయాలీనాటికీ ప్రయోగదశకు రాలేదు,
రాజకీయాలె కొరివి దయ్యాలై కులుకుతున్నాయి."

(నా గొడవ–6: 'ప్రజాకీయాలు')

రాజకీయాల్ని ప్రజాకీయాలుగా మార్చడమే కాళోజి కవితధ్యేయం. తెలంగాణా విప్లవంలో ఉద్భూతమైన ఆశలకూ, ఆశయాలకూ స్వరకల్పన, అక్షరకల్పన, చేశాడు కాళోజి. 1953 లో "నా గొడవ" అనే కాళోజి కవితాలత వెలుగుచూచింది. అప్పటి నుంచీ రాజకీయాల్లో మార్పుల్ని గమనిస్తూనేఉన్న కవికి ఆనాటి ఆశలూ, ఆశయాలూ క్రమంగా వమ్మై పోవడం, ఆవేదనా, ఆగ్రహమూ కలిగించింది. 1966–67లో 'పరాభవ' నామ సంవత్సరంలో, ఋతుక్రమం తప్పకుండా కాళోజి కవితాలత, పదమూడేళ్ళ తర్వాత, ఆరు "నా గొడవ" పువ్వుల్ని పూసింది. జనసామాన్యానికి రాజకీయాలద్వారా జరుగుతున్న పరాభవానికి 'పరాభవ'నామ సంవత్సరం పరాకాష్ఠగా తోచింది కాబోలు।

"ఏమిజన్మంబేమి జీవనమూ।"అంటూ బస్సులదగ్గర బిచ్చమెత్తుకుంటూ పాడే స్త్రీ పురుషులు కనిపిస్తే—

"కలిమిలేమి చేతవెలయు గాదెలోకము
మంచి చెడ్డ జంట పేర్ల మాయలోకం...."(నా గొడవ–1:"లోకం")

అనే కాళోజి గేయమూ,

"గడియ గడియకు మారు ప్రపంచము
గవ్వకునూ కొఱగాని ప్రపంచము" (నా గొడవ–1:'ప్రపంచము')

అనే కాళోజి పల్లవి వెంటనే స్ఫురిస్తాయి. ఇది ప్రజాకవిత్వం. ఈ నాటిది కాదు. ప్రజాకవితకు జనసామాన్యంలో ఎప్పుడూ ఆదరణ ఉండనే ఉన్నది. చదువుకున్న వారినుంచీ మాత్రం ఆదరణా గౌరవం దానికి ఈ శతాబ్దిలోనే లభించాయి. వేమన గొప్పప్రజాకవి. ఈ శతాబ్దంలో అభ్యుదయం, విప్లవం అనే రాజకీయాలు కవులను ఆకర్షించడంతో, నేటి రాజకీయాలకు జనసామాన్యంయొక్క మద్దతు అవసరం కావడంతో, కవిత్వానికి రాజకీయాలకూ సంయోగం సంప్రాప్తమైంది. ఫలితాలు చెప్పుకోదగ్గవిగానే ఉన్నాయి. కవిత్వపు గుణదోషాల నిర్ణయం రాజకీయాలమీద ఆధారపడటం (సాహితీ పరుల్లో ముఠాలు), రాజకీయాలు, అరుదుగానే అయినా, కవితామయం కావడం (శ్రీమతి సరోజిని నాయుడు రౌండ్ టేబిల్ సమావేశంలో పాల్గొనినప్పుడు) అటునుంచి, 'రాజకీయ కవిత్వం'అనే ఒక విశిష్టమైన కవితాశాఖ ఒకటి ఉద్భవించింది. తుమ్మలవారి 'రాష్ట్రగానం', రాయప్రోలు, విశ్వనాథల ఆంధ్ర ప్రశస్తి పద్యాలు అన్నీ రాజకీయ కవిత్వం. దానికే, ప్రత్యేకత కోసం, మార్క్సిస్టు రాజకీయవాదులు 'అభ్యుదయ కవిత్వం'అని నామకరణం చేశారు. భావ కవిత్వమూ కవిత్వమేనా? అన్న ప్రశ్నవచ్చినట్లుగానే రాజకీయ కవిత్వమూ కవిత్వమేనా? అభ్యుదయ కవిత్వమూ కవిత్వమేనా? అధివాస్తవిక కవిత్వమూ కవిత్వమేనా? అంటూ ప్రశ్నలు వచ్చాయి, వస్తూనేఉంటాయి. పల పుష్పాదుల్లో జాతులకు మల్లేనే కవిత్వంలోనూ జాతులుఉన్నాయి, ఉంటాయి, అనేసత్యం గ్రహిస్తే ఈ ప్రశ్న లిలాపుట్టుకురావడం ఆగిపోవచ్చునేమో। ఇందులో హెచ్చులొచ్చూ— గులాబీ గొప్పదా? గన్నేరు గొప్పదా?— అనే మీమాంసకూడా వ్యర్థమే। లోకోభిన్న రుచిః

పోతే, యిప్పుడు గమనించవలసింది 'ప్రజాకీయ'కవితా 'రాజకీయ' (లేక అభ్యుదయ) కవితా ఒకటి కావనే విషయం। కాళోజిని అభ్యుదయకవి అనుకున్నారు. కాదు, 'ప్రజాకీయ'కవి అని మనవి। ఒకరాజకీయకవి దళిత ప్రజానీకంమీద సాను భూతితో, విప్లవాన్ని ఆవాహనచేసే మనస్తత్వంతో, వ్రాసినా, అకవిత్వం కాస్తా సామాన్యప్రజకు బోధపడకపోవచ్చు. ఉదాహరణ'త్వమేవాహం' కావ్యం అది రాజకీయ కవిత్వమేతప్ప ప్రజాకీయకవిత్వం కాలేకపోయింది. 'త్వమేవాహం'లోని వస్తువే కాళోజి వాక్కులో ప్రజాకీయ కవితగా రూపొందిన వైనం చూడండి:

"న్యాయమును పాటింపనొల్లని/ఆధిపత్యము అందయుంచిన
హత్య, దోపిడి, మానభంగాల్/నిత్యకర్మలచేరినట్లే....
బూజుపట్టిన రాజ్యభారం/మోయజాలక జానపదులు
రోజుచుండే దేశమేలెడు/రాజు రోజులు నిండినట్లే
కల్లగాదిది, కైతగాదిది/కాలదేవత గర్భవేదన...."

(నా గొడవ_1:'నగ్నసత్యాలు')

దాశరథి "నా తెలంగాణ కోటిరత్నాలవీణ" అంటే, అదీ రాజకీయకవిత్వమే కాని ప్రజాకవిత్వం కాదు. కారణం: తెలంగాణను వీణగా ఊహించి పలికే భావుకత, సాహసం, సామాన్యునికి చెందినవికావు; కవి ఆమాట అన్నతర్వాత సామాన్యుడు దాన్ని అందుకోవచ్చు, కాని కవి విశిష్టభావనాశక్తి నుంచీ అది ఊడిపడకపూర్వం దాన్ని అందుకునేశక్తిగాని, అలా అనేసాహసంగాని, సామాన్యునికి లేదు; సామాన్యునివి అందరి మనస్సుల్లో మెదిలే భావనలే, అందరి నోళ్ళలో అదే మాటలే. పోతే, సామాన్యుని భావనాశక్తి ప్రమాణానికి ఒక ఉదాహరణ:

"రక్కసుని చావుచే రంజిల్లె జగమంచు
కోటివెల్గులు చాటె నాటి దీపాలు
రక్కసులు బాధింప రక్షయేలేదంచు
కోటిరీతుల చెప్పునేటి దీపాలు"

(నా గొడవ_1:దీపావళి దీపాలు)

మాన్యుడు వ్రాయగలిగినదే ప్రజాకవిత్వం. సామాన్యుడు వ్రాయగలిగిన కవిత్వమే ప్రజాకీయకవిత్వం. 'సామాన్యుడు' అంటే ఎవరు? సామాన్య మానవుడు (common man), వీధి మనిషి (man in the street), అపండితుడు (lay-man) అని వ్యవహరించడం ఈ శతాబ్దిలో అలవాటైపోయింది. దానిఅర్థం: మానవునికి సగటు (average) ప్రమాణంలో శక్తియుక్తులనూ, చదువుసంధ్యలనూ, లోకజ్ఞానాన్నీ ఊహిస్తూ, అటువంటివాళ్ళే లోకంలో అధిక సంఖ్యాకులని మనం అంగీకరిస్తున్నామన్నమాట. కాళోజి ఈ సగటు మానవునికి ప్రతినిధి. సగటు మానవునిలాగే ఊహిస్తాడు, భావిస్తాడు, పలుకుతాడు. సగటు మానవుని రాజకీయ

చైతన్యాన్ని తన కవిత్వంలో అభివ్యక్తంచేస్తాడు. అదే యితర రాజకీయకవులకూ అతడికీగల ముఖ్యమైన భేదం. అందుకే కాళోజి ప్రజాకీయకవి. అలాగే శ్రీనార్ల వేంకటేశ్వరరావు ప్రజాకీయకవి. నాకు తెలిసినంతలో తెలుగులో మరొకరు కనిపించరు.

లోకంలో చెప్పేవాళ్ళది ఒక వర్గం, వినేవాళ్ళది మరొకవర్గం. చెప్పేవాడికి వినేవాడు లోకువ. మతప్రవక్త, కవి, శాస్త్రవేత్త, రాజకీయవాది—వీళ్ళంతా చెప్పేవాళ్ళు. వీళ్ళందరి ప్రయత్నమూ, వినేవాళ్ళని, అంటే జనసామాన్యాన్ని, తమవైపుకు తిప్పుకోవాలనీ, తమను అనుసరించేట్లు చేయాలనీ! సామాన్యుని మనస్తత్వంతో సంపూర్ణమైన ఏకీభావం చెప్పేవాళ్ళకెవరికీ ఎన్నటికీ కుదరదు—కుదిరితే చెప్పేవాడి విశిష్టత. నాయకత్వం, మటుమాయమైపోతుంది! వినేవాళ్ళ మస్తిష్కాల్లో మతంనుంచి కాస్త వేదాంతమూ, కవులనుంచీ కాస్త కవిత్వమూ, శాస్త్రవేత్తలనుంచీ కొన్ని అభిప్రాయాలూ, రాజకీయకులనుంచీ కొన్ని ఆశలూ సంక్రమించి, సంగమించి ఒక విచిత్ర మిశ్రమం తయారై ఉంటుంది. ఈ మిశ్రమం వినేవాళ్ళ ఉమ్మడిసొత్తు. దీన్ని యథాతథంగా భాషలో, గేయాల్లో పట్టడం తమాషాకాదు. కాళోజి పట్టాడు. 'కవి'గా కాళోజి చెప్పేవాళ్ళ వర్గంలో చేరడానికి నిరాకరించాడు.

రాజకీయ కవిగా మార్క్సిజాన్నీ, గాంధీజాన్నీ దేన్నీ 'చెప్పడం' లేదు కాళోజి. ఆ 'యిజా'లనుగూర్చి జనసామాన్యంలో ఉండే ఊహాపోహాల్ని మాత్రమే వ్యక్తం చేస్తాడు.

> "అన్నపురాసులు ఒకచోట/ఆకలి మంటలు ఒకచోట ...
> సంపదలన్నీ ఒకచోట/గంపెడు బలగం ఒకచోట ..."

(నా గొడవ–1: 'వ్యత్యాసాలు')

అంటూ ఒకచోట వర్గవిభేదాన్నీ, వర్గకలహాన్నీ (class-war) చాటే మార్క్సిస్టులా కనిపిస్తాడు. కాని 'ఆస్తిహక్కు' (right of property), 'ఆర్థికవిప్లవం' (economie revolution) విషయాల్లో అతివాదదృష్టి అంటే అతనికి అపనమ్మకమే! ఇది సామాన్యుని ధోరణి:

"దున్నేవానిదిభూమి/అన్నవాడె పురోగామి
ఉండేవానిదె యిల్లు/అంటేనే మాటలుచెల్లు
అమ్మేవానిదె సరుకు/అనంది సాగదుబ్రతుక
తోలేవానిదె బండి/యిదికూడ నిజము సుమండి
కోసినవానిదె పంట/అనకుంటే రాదాతంట?
లేపినవానిదె మూట/అంటేమాత్రముచేటా?"

(నా గొడవ–1:'ఈ అలజడి కొన్నాళ్ళు')

ఇలా అవహేళనచేస్తూ, మార్క్సిస్టులనుగూర్చి:

"ఈఅలజడి కొన్నాళ్ళు/క్రొత్త దేవర తిరునాళ్ళు
మళ్ళీ అదేపాతకత/కాళోజికేలవెత?"

అంటూ తేల్చివేశాడు. ఎన్నివిప్లవాలు వచ్చినా, వ్యవస్థలూ, ప్రభుత్వాలూమారినా, 'పాతకత' మారదు, సామాన్యునిస్థితిమారదు. అనే భావం అచ్చమైన సగటు మానవుని భావం. ఇది ప్రగతివాదులకు, అభ్యుదయకాములకు సహింపరాని అలసత్వంగా, నిస్పృహగా కనిపించవచ్చు. కాని యిందులో మానవనైజానికి సంబంధించిన ఒక మహత్తర సత్యం ఉంది. ఈ సత్యం సామాన్యుణ్ణి స్పృశించినంతగా 'చెప్పేవాళ్ళ' వర్గాన్ని స్పృశించదు!

"పీలున్న ప్రతిచోట విఱ్ఱవీగుచు అపర
హిట్లరౌతాను నే హిట్లరౌతాను.
తలదన్నువానికడ తలవంచి దయయనుచు
గాంధి నౌతాను నే గాంధి నౌతాను.
మంది తప్పులఏరి మనసు ఖాతానింపి
వడ్డి వడ్డీకట్టి వల్లించుతాను.
నా తప్పులనుదాచ నానారకాలైన
ధర్మసూత్రాలతో దడికట్టుతాను"

(నా గొడవ–1:'నేను....')

పెద్దగాలీవానావస్తే చెట్లూ చేమలూనేలకు ఒరిగి నాశనమయ్యాయి, గడ్డిపోచఅలావంగి యిలా నిటారుగా నిలుచున్నదట! చరిత్రలో హిట్లరిజమ్ వచ్చినా గాంధీజమ్ వచ్చినా అది సామాన్యునిమీద చూపించిన, చూపించబోయే ప్రభావమే పై గీతంలో చెప్ప బడింది. ఒక 'ఇజా'న్ని రూపొందించటం, దానికి కట్టుబడి ఉండటం, దృక్పథంలో అపభ్రంశాలు రాకుండా, నడవడిలో ఒడిదుడుకులు లేకుండా, తన్నుతాను క్రమ శిక్షణలో బంధించుకునే కష్టం, వృక్షాలూ మహావృక్షాలూ అయిన అసామాన్యులకు గాని, గడ్డిపోచ అయిన సామాన్యునికి ఆ యిబ్బంది లేదు! 'ఎప్పటికెయ్యది ప్రస్తుత మప్పటి కయ్యది'అన్నట్లు "ధర్మసూత్రాలతో దడికట్టుతాడు." కాలం జరిగిపోతుంది, హిట్లరు, గాంధీ, కాలంలో క్షయమౌతారు. సామాన్యునికి అక్షయంలేదు! హిట్లరు, గాంధీ, చరిత్రలో మరకలుగా మెరుపులుగా నిలుస్తారు; సామాన్యుడు ఆకాశంలా ఎప్పుడూ ఉంటాడు కాబట్టిప్రత్యేకంగా కనిపించడు. ఇది సామాన్యుని మూలతత్త్వం మానవనైజం తాలూకు మహత్తర సత్యం. ప్రజాకీయకవితకు ఆధారం!

సామాన్యునికి అంతః కరణలేదని అనుకోగూడదు. అది అతనిశక్తిసామర్థ్యాలకు తగినట్లుగానే ఉంటుంది. సామాన్యుడు గాంధీని ప్రేమించాడు, పూజించాడు. గాంధీ మరణిస్తే దుఃఖించాడు. అంతకంటె ఏమిచెయ్యాలో అతనికితెలీదు, తెలిసినా శక్తి చాలదు! ఎందుకో అంతఃకరణలో అర్థంకాని అలజడి:

"ఇంకేమి కావాలె? ఇంకేమి చేయాలె?
బ్రతికినన్నాళ్ళు నినుబాపు అనిపిలిచితిమి
చనిపోయిన నిన్ను జాతిపిత జేసితిమి....
ఏనాడో నినుమేము 'ఏసు'గా జేసితిమి
ఎవనచేతనో నీవు ఏసగుట జూచితిమి...."

(నా గొడవ—2:'ఓ గాంధీ')

ఇందులోని వ్యంగ్యం గొప్పది. గాంధీని 'ఏసు'గాజేయటంలో ఆయనపట్ల గౌరవమూ భక్తీ చూపినట్లేకాదు, ఆయన సిద్ధాంతాల్ని దారుణంగా సిలువ వెయ్యటంకూడా ధ్వనిస్తోంది. అలా చేసినవాడు సామాన్యుడే! కాని అది అతనికి అవగాహన కాదు; 'ఎవనిచేతనో' అలాజరిగిందని సమాధానం చెప్పుకోచూస్తాడు. అంతఃకరణ

ఊరుకోదు. "ఇంకేమి కావాలె? ఇంకేమి చేయాలె?" తృప్తిజెందని పితృదేవత కలలో కనిపిస్తే సామాన్యుడు వెలిబుచ్చే అదుర్దా వ్యక్తమౌతోంది! చివరకు 'యిహౌకభ్రమ' అని నవ్వేసి త్రోసిపుచ్చడం జరుగుతుంది:

"కాళోజి మాటలకు కడుపుబ్బనవ్వితిమి" అని ముగింపు.

సామాన్యుడు గొప్పవాళ్ళసూక్తుల్ని వింటూ ఉంటాడు. తను ఆచరణలో పెట్టలేకపోయినా ఫరవాలేదు యితరులు వాటిని ఆచరణలో పెట్టలేకపోయారనే విచారిస్తూ ఉంటాడు! ఎవరినీ ప్రత్యేకంగా ఉద్దేశించకుండానే 'ఓమానవుడా!' అంటూ సర్వమానవ దుష్టత్వాన్నీ తిట్టిపోస్తూ ఉంటాడు.

ప్రపంచం అనే అంగట్లో అన్నీఉన్నాయి, కాని మానవుడనే అల్లుడి నోట్లోశని ఉన్నది అనడమే 'శాస్త్రదాస్యం' (నా గొడవ–2) అనేగేయంయొక్క ఉద్దేశం. "ఇన్నియున్నను ఏమిచేయక, చేయనొల్లక సిగ్గుజెందక, నరుడు దయ్యపుపురిటిపోరడు" ఈ గేయానికి పల్లవి. (పోరడు అనే తెలంగాణ మాండలికపదం ఇక్కడ ముద్దుగా బిగింపబడింది.) శాస్త్రం(science)అంటే అపండితునికి అనుమానం, అవిశ్వాసం. శాస్త్రం పెరగటంవల్లే మానవుని దుష్టత్వంకూడాపెరిగిందని అతని ఊహాపోహ. రష్యనులు కుక్కను అంతరిక్షంలోకి పంపారు. కుక్క మనిషిని నమ్ముకున్నజంతువు. ఇది న్యాయమా? 'విశ్వాసం' మేధాప్రవృత్తికి బలియివ్వబడింది. మేధాప్రవృత్తి కారణంగా మానవుడు అధికుడని అనుకుంటున్నాడు. కాని విశ్వాసం కలిగిన కుక్కకంటె విశ్వాసాన్ని బలియిచ్చే మనిషి ఎలా అధికుడు? ఈ భావాలను పొందికగా ధ్వనింప జేస్తూ సాగినరచన 'శ్వమేధయాగం'. కాళోజి ఉత్తమరచనల్లో ఒకటి.

సమకాలీన రాజకీయాలను విమర్శించేరచనలే ఎక్కువగా కనిపిస్తాయి ఈ సంపుటాల్లో. రాజకీయాల్లోకుట్ర, కుతంత్రమూ, మోసం, ముఠాతత్వం, విమర్శించే పట్ల వ్యంగ్యం వదిలిపెట్టి కుండబ్రద్దలుకొట్టినట్లు చెప్పడమే కాళోజి ధోరణి:

"గుండెపగిలి పోతుంటే/కడుపుమండి పోతుంటే
కండకరిగి పోతుంటే/ఎముకవిరిగి పోతుంటే
బ్రతుకు చితికి పోతుంటే/శాంతి—శాంతట! శాంతి!!"

(నా గొడవ–3: శాంతి–శాంతట! శాంతి!!)

Nepotism అన్న యింగ్లీషు పదానికి కాళోజిచేసిన చక్కని తర్జుమా 'దాదాగిరి'

ఏ పార్టీ రాజ్యంచేసినా, ఏసిద్ధాంతాలు అమలుజరిపినా, సామాన్యుడు కోరేవి—న్యాయం, భద్రత, రక్షణ. అవి లుప్తమైపోయినప్పుడు రాజకీయవాదులకూ దొంగలకూ భేదం లేదంటాడు:

"నా కబళము కాజేయగ కదలాడెడి పదిచేతులు
పదినోళ్ళలా మన్నుగొట్ట నా చేతుల కదలికలు"

(నా గొడవ—3:ఎవరిదేమిపోతున్నది?)

అంటూ పాలకవర్గంలోని పరస్పర ప్రతారణను దుయ్యబట్టుతాడు.

"ఎవరిదేమిపోతున్నది? ఎవరికేమిపోతున్నది?"

నష్టపోతున్నవాడు సామాన్యుడు! రాజకీయ వాదులనుగూర్చి—

"మానమన్నదుంటేకద హాని భయము, భంగపాటు
కష్టార్జితముంటేగద నష్టమాయెనన్నచింత"

(నా గొడవ—3:ఎవరిదేమి....)

అంటూ బజారుకెక్కుతాడు. నా గొడవ—3లోని రచనలన్నీ యిదేధోరణి.

గడచిన పదిహేనేళ్ళ రాజకీయాలనూ విమర్శిస్తూ కాంగ్రెసు మార్కు సోషలిజాన్ని, విదేశీ ఋణాలను, ప్రభుత్వపు 'అంకెలగారడీ'ని, పంచశీలనూ, పంచవర్ష ప్రణాళికలనూ, శుష్కప్రియాలతోడి శూన్యఫలితాల్నీ దుయ్యబట్టిన గేయాలు చాలా ఉన్నాయి. ఇదంతా రాజకీయ కవిత్వం; కాని కాళోజీ రాజకీయాల విమర్శకు ప్రాతిపదిక ఏ 'ఇజమూ'కాదు, నిజంతప్ప! ఆ'నిజం'కూడా సగటు మానవునికి అందుబాటులో ఉండేనిజం. మేధావికి, తాత్త్వికునికి, అంతర్ముఖునికి గోచరించే 'నిజం' కాదు.

రాజకీయంగా జనసామాన్యానికి ఈ కవిచేసే హెచ్చరిక ఒకటే— ఓటువేసే సమయంలో జాగ్రత్తగా వెయ్యమని! ఓటు, ఓటరి కావన్నా, కర్తవ్యం, వృథావృథా, ఓటెవరికి?, ఎన్నిక సంరంభం మొదలగు గేయాల్లో ఈ ప్రబోధం మళ్ళీమళ్ళీ చెయ్యబడింది. కాళోజీ అచ్చమైన ప్రజాస్వామ్యవాది. సామాన్యుడు అంతకంటె మరేం కాగలడు? అన్నిలోటు పాట్లకు—రాజకీయమైన వాటికి—పరిష్కారమార్గం

ఒక్కటే: అది ఓటు విలువని గుర్తించి సామాన్యుడు వ్యవహరించటం. అంతకంటె 'ప్రజాకీయం' లేదు.

శృంగారాన్ని ఎక్కడా చేబట్టలేదు కాని, శృంగారాన్నిగూర్చిన అభిప్రాయాలు ఒకటి రెండు ఈ రచనల్లో ఉన్నాయి. శృంగారం ఒక 'అవసరం'. దాన్నిగూర్చి లేనిపోని ఊహలూ, ఉబలాటాలూ, నీతులు నియమాలూ పెంచుకోవటం అనవసర మేమో. ఇది సగటు మానవుని అభిప్రాయం:

"కామతృష్ణల తృప్తికోరు దేహాలు
ప్రేమ గీమల గొడవలోన పడనేల?....
ఆకలికి అన్నంబు దొరకవలె కాని
అడుగుకొని తింటేమి? అత్తపెడితేమి?
అరువు సొమ్మైతేమి? అప్పదైతేమి?"

(నా గొడవ–1:అవసరము)

ఇలా అనడంవల్ల, స్నేహానికీ, మమకారానికీ, విశ్వాసానికీ, నిజాయితీకి విలువ యివ్వడంలేదని కాదు. 'చెలిమి దేవత లెరుగని దివ్యానుభవ' మంటూ వ్రాసిన ఖండికలు నాగొడవ–1లోనూ నా గొడవ–6లోనూ ఉన్నాయి. 'చెమ్మగిలిన కన్నులలో' అనే గేయంకూడా అలాంటిదే—

"చెమ్మగిలిన కన్నులలో–కమ్మలెన్నొ చదివినాను
మనసు మాట కూరలేదు–ఉనికి తప్పిజారిపోదు
తనువు యిపుడు నీదికాదు–'మునుపు' తిరిగి రాదురాదు"

(నా గొడవ–1:చెమ్మగిలిన కనులతో)

కాళోజీ కవిత లోతులేనివాగు. మిలమిలలాడే యిసుకా, జలజలపారే పల్చటి నీరూ ముచ్చట గొలుపుతాయి. అంతకంటె ఎక్కువ ఆశించటంలో అర్థం లేదు. ప్రజాకీయకవిత స్వభావమే అది. భావగాంభీర్యము చాలదనీ, క్రొత్తదనమూ చమత్కారమూ కనిపించవనీ, లోకవిమర్శతప్ప ఆత్మ వివేచన మృగ్యమనీ, భాషలో శైలిలో నాణ్యము లోపించిందనీ–యిలా మనం కోరేవిలేవని పెదవి విరిచెయ్యవచ్చు. విమర్శకుడు తనుమేధావిననీ, రసికుణ్ణనీ, సంస్కారిననీ 'అహం'తో ఈ కవిత్వాన్ని చూస్తే ఇందులోని విశిష్టత, గుణం. బోధపడవు. ప్రజాకీయ కవిత సామాన్యుని రాజకీయ ప్రతిబింబం. సామాన్యునిలో ఉన్న మహత్తు ఈ కవిత్వంలోనూ ఉన్నది.

నాగస్వరం

(రచన: శ్రీ బండి నాగరాజు. ప్రచురణ–ప్రాప్తిస్థానం: 'మిత్రమండలి' 7/334, తూర్పువీధి, గూడూరు, నెల్లూరు జిల్లా. మూల్యం: ఒక రూపాయి.)

ఒకటి రెండు ఖండికలు తప్ప 'నాగస్వరం' వచనగేయాల సంకలనం. రచయిత శ్రీ బండినాగరాజుగారు వీటిని 'శుద్ధవచనాలు' అన్నారు. కవిత్వమనే పదార్థం వున్నంతసేపు వచనాలంటే యేమి, పద్యాలంటే యేమి, మరింకోపేరుతో పిలిస్తేయేమి అనుకునేవారికి 'నాగస్వరం' తృప్తి నిస్తుంది. డొంకతిరుగుడుగా చెప్పట మనేది ఇందులో యెక్కడా కనిపించదు. భావమూ, భాషా ఒకదానికన్న ఒకటి పదునుగా వున్నాయి.

'నా చుట్టూవున్న సమాజం, దాన్ని ఆధారంచేసుకొని వున్నదైవం, సారస్వతం ఈ నారచనకు Inspiration.' అని తనను రచనకు పురికొల్పిన మూడువిషయాల్ని పేర్కొన్నారు నాగరాజుగారు. ఈ మూడింటి విమర్శలో హాస్యం, హేళన, వ్యంగ్యం చోటుచేసుకున్నాయి. 'అమాయికం,' కళ్ళద్దాలు,' 'దేశంపాడైపోతోంది' లాంటివి చుట్టూవున్న సమాజం మీద, దానిలోని కుళ్ళుమీద నిశితవిమర్శలు. మొదటి నాలుగైదు గేయాల్లో సమాజాన్ని ఆధారంచేసుకున్న దేవుడు కనిపిస్తాడు. ఏదోఅవసరముండి దేవుణ్ణి సృష్టించింది సమాజం. ఆ అవసరం లేనప్పుడు వూడగొడ్తేసరి! మనశ్శాంతి అంటారా? 'మనశ్శాంతి ఎవడిక్కావాలోయ్ తిండిలేక ఛస్తుంటేనూ?' అని దులిపేసాడు కవి. చివరి అయిదు పద్యాలు 'సారస్వతం' గురించి చెబుతాయి. అర్థంకాని బండ మాటల్తో 'తెలుక్కవిత్వం' రాసే పండితులనూ, సన్మానప్రియులైన 'మహాకవు'లనూ దుయ్యబట్టుతాయి.

ద్విపదలో రాసిన 'స్మరహరుడు' మాత్రా ఛందస్సులోసాగిన 'ఖిలేశ్వరుడు,' 'నయబోధ' బాగున్నా, వచనాలకు ప్రాధాన్యం ఇచ్చిన ఈ సంపుటిలో లేకుంటే బాగుండేది. ఏమంటే యిలాంటివి వున్నాయన్నసంగతి నాగరాజుగారే మరచిపోయారు. ఇవి శుద్ధవచనాలు. 'ఇందులో నేను ఏఛందస్సాంప్రదాయమూ పాటించలేదు' అన్నారు మొదట్లో.

చాలమటుకు ఉపాధ్యాయులే వున్న 'మిత్రమండలి' ఈ రచనను ప్రచురించడం అభినందించదగినది. ఏ ప్రాంతానికీ పరిమితం కాకుండా అన్ని ప్రాంతాల్లోని యువకుల రచనల్ని ప్రోత్సహింపదల్చుకున్న వీరి ఆశయం గొప్పది.

—"రాజీవ"

సమర్పణ: కథా సంకలనము. ప్రచురణ: జ్యోతిర్మయి సాహిత్య సాంస్కృతిక సమితి–వనపర్తి. మహబూబ్‌నగర్ జిల్లా. వెల. రెండు రూపాయలు.

మహబూబ్‌నగర్ జిల్లాలోని కొంతమంది కథకుల కథల్ని 'సమర్పణ' అనే పుస్తకరూపంలో ప్రచురించారు– ఆ జిల్లా రచయితల్ని, కళాకారుల్ని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో స్థాపించబడిన "జ్యోతిర్మయి" సంస్థవారు. రచయితల్లో తాము ఫలానా జిల్లాకు చెందినవారమనే చైతన్యాన్ని కల్పించటం కొంచెం గర్హనీయంగానే కన్పిస్తుంది.

ఈ సంకలనంలో ఐదు కథలున్నాయి. వల్లపురెడ్డిగారు వ్రాసిన "పరాజితులు" హిందూ సమష్టి కుటుంబాల్లో– తల్లిదండ్రులకు, కొడుకు కోడళ్ళకు మధ్య ఉత్పన్న మయ్యే మానసిక సంఘర్షణని చక్కగా చిత్రిస్తుంది. కాచిరాజు శేషగిరిరావుగారు వ్రాసిన 'మాయామాళవగౌళ'లో నరసమ్మ అనే ఒకపల్లెటూరి దాసిపిల్ల విషాదజీవితాన్ని వాస్తవికంగా చిత్రించే ప్రయత్నంజరిగింది. నూగూరి శాంతాదేవిగారి 'సమర్పణ' మరీ తెలుగుసినీమా కథలాగుంది. "సమాంతర రేఖలు" (ప్రభాకర్–ప్రేమశ్రీ)లో గ్రామాల్లోని రాజకీయ వాతావరణాన్ని చిత్రించే ప్రయత్నం జరిగింది. కాని అందుకు తగిననేర్పు రచయితకున్నట్లు కన్పించదు. సి. నాగేశ్వర్‌రావు వ్రాసిన "ఒకటీ—రెండూలమధ్య"—ఒక మోటారు డ్రైవర్ యాంత్రిక జీవితాన్ని చిత్రించేస్కెచ్.

ఈ కథా సంకలనాన్ని కవి, కథకుడు కీ. శే. బాలగంగాధర తిలక్‌కి అంకితంచేసారు.

—నవీన్.

కుందుర్తి, గోపాలచక్రవర్తి– సంకలనం 'వచన కవిత'పై సమీక్ష వచ్చే సంచికలో:

సమీక్షకుడు — అద్దేపల్లి రామమోహనరావు.

సృజన

జన్మదిన సంచిక నవంబర్‌లో వెలువడుతుంది. ఈ ఆధునిక సాహిత్య వేదిక ఈ ఏడాది ఇట్లా నిలచి, ఇంకా పటిష్ఠమవడానికి తోడ్పడుతున్న ఆంధ్ర సాహిత్యాభిమానులందరికీ మా ధన్యవాదాలు.

సాహిత్యలేఖ

సృజన 3 లో కవి మిత్రుడు శ్రీ రెంటాల గోపాలకృష్ణ-"ఆధునికాంధ్ర కవిత్వ తత్వం—ఒక పరిశీలన" అనేవ్యాసం సుమారు సమగ్రంగానేవుంది. చాలాకాలంగా మూగవోయిన యీ మిత్రునిగొంతు వినడానికి నాకెంతో ఆనందమూ ఆర్తీ కలిగాయి. (అందునా అతను గతంలో అధికంగా స్పర్శించని విమర్శనా వ్యాసంగంద్వారా సర్వుల ముందుకీవచ్చి— నిలబడటం మరింత శుభోదర్కంగావున్నది. అతనికి నా ప్రత్యేకాభివందనాలు.)

ఐతే అతని వ్యాసంలో 38వ పుటలో ఉద్ఘాటింపబడిన విషయాలకు స్పష్టత (clarity) కనిపించడంలేదు. చివరి రెండుపేరాలలోను రెంటాల యిలాఅన్నారు:

"నాటినుండి నేటిదాకా కలం ఆపకుండా రచనలుసాగిస్తున్న ఆధునిక కవులలో ఆరుద్ర—సోమసుందర్ ప్రభృతులున్నారు. ఇట్టి అవిరళ కృషిసాగిస్తున్నందుకు వీరిని అభినందించవలసిందే। అయితే ఆరుద్ర రచనలలో గంభీరత ఉత్తమ కావ్యలక్షణాలకంటే ట్రిక్కులు, సర్కసుఫీట్లు ఎక్కువ. చిత్రకవిత్వం కాలక్షేపానికి బాగుగా వుంటుంది. కాని సర్కసు ఫీట్లతో కవిత్వం నిలుస్తుందా?" (అడుగుగీతలు నావి.)

అన్నది ప్రశ్న. ఈ ప్రశ్న 1948 నుంచి నేటివరకూ ఆరుద్ర విషయంలో ఉదయిస్తూనేవున్నడి. త్వమేవాఽహమ్-తెలుగు స్వతంత్రలో ధారావాహికగా ప్రచురితమవుతున్ననాటినుంచి మేధావులు సర్వులూ సందేహాలు వెలిబుచ్చుతూనేవున్నారు. తమ అసమ్మతిని ప్రకటిస్తూనేవున్నారు. కాని రెండు దశాబ్దాలుగాసాగి అతనికవితావాణి కలిగించిన ప్రకంపన ధ్వనులు దేశం నలుమూలలా వ్యాపించి ఉజ్జ్వల కవులశ్రేణిలో ఆరుద్రను నిలిపాయి. అతని కవితా ఫణితి—ఒక వ్యక్తివైశిష్ట్యంగా సాహితీ లోకంలో స్థిరీభూతంగా నిలచింది. కేవలచమత్కారత్వవత్త్వమూ, చిత్ర కవితారీతులూ— కవితకు అవగుణంగా ఎందరు ఎన్నికాలాలుగా ముద్రవేస్తూన్నప్పటికీ వీటి వెలుపలి స్వరూపం క్రింద ఆత్మభూతమైన నిశిత దర్శనా విశేషంవల్ల అతని కవితలకు ప్రత్యేకస్థానం సిద్ధించింది. అతనిది అనితరసాధ్యమైన మార్గం. అనన్యసులభమైన ఫణితి. ఈ సత్యాన్నికూడా విమర్శకులు పరిగణనలోకి తీసుకుతీరాలి. అంతేగాక,

ఆరుద్రలో యిటీవలి కొన్నినాళ్ళుగా కొండొక మూడవపరిణామం వ్యక్తమవుతూన్నది. భావవ్యక్తీకరణసారళ్యత, సద్యఃస్ఫూర్తీ సాధింపబడుతున్నవి. ఇందు కుదాహరణగా— ఈ సంచికలోనే (సృజన-౩) ప్రకటితమైన కవితను పేర్కొనవచ్చు. లోగడనవతలో ప్రకటితమైనస్ఫూట్నిక్ టెక్నిక్ వంటివానిలో అక్కడక్కడా అరుదుగా తప్పిస్తే అతని గతకాలపు చమత్కారి మార్గం బయటపడటమే లేదు. కవిగా ఆరుద్ర గురించి నా అంచనా యిది.

అదేవ్యాసంలో రెంటాల తరువాతి పేరాలో యిలా అన్నారు.

"కవి వయస్సుతోపాటు, అనుభవంతోపాటు అతని ప్రజ్ఞ, తాత్త్విక దృష్టి పరిణతిచెందాలి. అతని కవిత ప్రౌఢత్వాన్నీ, సౌష్టవాన్నీ, సౌందర్యాన్నీ సంతరించుకొని ఒక మహా కావ్యలక్షణాన్ని పొందాలి. మరి అభ్యుదయ కవులు చాలమందిలో అలాంటిది ఉన్నట్లు కన్పించదు. సోమసుందర్ రచనలలోనూ యింకా అస్పష్టత, అయోమయం పోలేదు. ఈనాడు ప్రముఖంగా రచనలు సాగిస్తున్నవారు కావడంచేత వీరిని గురించి ప్రస్తావించాను. మరోతలంపుతో కాదు. (అడుగు గీతలునావి.)

రెంటాల మనసు నెరిగిన ఏ వక్కరుకాని—అతనికి దురుద్దేశాన్ని అంటగట్టే నేత్రకుసుమావరోధంలో చిక్కుకోరు. కాని యీపైన ఉల్లేఖించబడిన పేరాలో— ఒకానొక సార్వత్రిక సూత్రాన్ని అనుసంధించి—"అభ్యుదయ కవులు చాలమందిలో అలాంటిది ఉన్నట్లుకనిపించదు." అని తీర్పుచెప్పడం మాత్రం ఘోరమునక తప్పదు. కవి వయఃపరిపాకంతోపాటు అనుభవజ్ఞానాన్ని తద్ద్వారా ప్రజ్ఞావిశేషాన్నీ అల వర్చుకోవాల్సిందే! అట్టిది మృగ్యమైనప్పుడు కవి అభివృద్ధిలేని స్థాణురూపం పొందుతాడు. అతని తాత్త్వికదృష్టి పరిణతిచెంది తీరాల్సిందే! ఇట్టి మౌలికగుణాలు అవాంఛితాలని ఏ బుద్ధిహీనుడూ భావించడు. కాని యిట్టి సుగుణాలు ఫలానాకవిలో లేవని ముద్ర గుద్దదల్చుకున్నపుడే విమర్శకుడు మరింత నిశితదృష్టితో పరిశీలించాల్సి వుంది. పైగా ఆ కవి కృతకవితాశ్రేణినంతా కూలంకషంగా అవలోడనచేయాలి.

"సోమసుందర్ రచనలలోనూ యింకా అస్పష్టత అయోమయం పోలేదు." అని రెంటాల ఒక Sweeping generalisation తో సోమసుందర్ సాగిస్తున్న 'ప్రముఖ రచనల'ను తుడిచిపెట్టి పారేయడానికి ప్రయత్నించడం మాత్రం—మెచ్చుకో తగినది కాదు. 'సోమసుందర్ రచనలలోనూ యింకా అస్పష్టత' ఉండి వుండవచ్చు; 'అయోమయంపోక' పోవచ్చు. కాదనేటంతటి అహమిక నాకుగాలేదు. కాని యీ 'అస్పష్టత, అయోమయం' అనేదుర్లక్షణాలు—ఏ తావులలో ఏ రూపంగా ఉన్నవో మాత్రం సోదాహరణంగా పరిశీలించబడకపోవడం విమర్శ వ్యాపారానికి గర్వకారణం కాదు. వీరి యీ సూత్రప్రతిపాదనకు బలోపేతమైన ఒక్క ఉదాహరణకూడా చూప

లేకపోవడం మరింత శోచనీయం। ఇట్టి తీర్పు ప్రకటించేముందు సోమసుందర్‌లో 'అస్పష్టత – అయోమయం' ఎక్కడవున్నవో నిరుద్రేకంగా పరిశీలిస్తే నేనెంతో సంతోషించేవాడిని.

ఈ రెండు తావులలోనూ తప్పితే రెంటాల వ్యాసం మిగిలిన భాగాలతో నాకేం పేచీలేదు. ఇదంతా డిఫెండుచేసుకుందుకుకాదు కాని, కొత్త చిగుళ్ళు సమీక్షలోకూడా... "మెత్తగా పూలపాటలు పాడుకొనే సోమసుందర్" అని సమీక్షకులు ఒక catogorical Remark చేయడంకూడా కవికి న్యాయంచేకూర్చే తీర్పుకాదు. సోమసుందర్‌లో మెత్తని పూల పాటల శృంగారమూ, లోకవృత్త పరిశీలనతో కళాఘాతంగాసాగే విప్లవ అంగారమూ అవిచ్ఛిన్నధారలుగా సాగుతున్నవనడం-సత్యానికిచేరువగాఉండే దర్శనం. అయినా ¯ండున్నర దశాబ్దాల కాలంలో యిందరిముందుకువచ్చి నిలచినది-విప్లవోజ్జ్వల కవితారీతులతోనే: ఇది విస్మరించడం— విమర్శకులకు కావాలని చేస్తున్న దుర్ఘటన కారాదు! అట్టిది అధునిక సాహితికి ఆరోగ్యంకాదు.

—సోమసుందర్

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

Re. One